సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా

# ప్రపత్తి శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాసపత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 12 ఫిబ్రవరి 2025 పేజీలు: 36 వెల: 30/-



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక



# ముఖచిత్రపరిచయం

సప్తాశ్వ రథ మారూఢం ప్రచండం కశ్యపాత్మజం
శ్వేత పద్మ ధరం దేవం తమ్ సూర్యం ప్రణమామ్యహం

ఏడు గుర్రాల రథం మీద ప్రయాణించే ప్రచండుడు, కశ్యప ప్రజాపతి కుమారుడు, తెల్లని పద్మాన్ని చేతిలో ధరించిన వాడైన సూర్య భగవానుణ్ణి నేను నమస్కరిస్తున్నాను.

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన ఉత్తరాయణ మాఘ మాస శుక్ల పక్ష సప్తమి నాడు రథసప్తమి. ఈ రోజు పవిత్రదినముగా భావించి సూర్యారాధన చేస్తారు. ప్రాతఃకాల స్నాన, జప, అర్ఘ్యప్రదాన, తర్పణ, దానాదులన్నీ అనేక కోట్ల రెట్లు పుణ్యఫలములను అందిస్తాయని, 'రథసప్తమీ' వ్రతమాచరిస్తే సూర్యభగవానుని అనుగ్రహముచే ఆయురారోగ్యాది సకల సంపదలు కలుగునని పురాణప్రబోధము. రథసప్తమి రోజు విష్ణ్వాలయాలలో సూర్య వాహనంపై ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి, అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీనం వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ఏడాదిలో ప్రయాణిస్తాడు. రథసప్తమి సందర్భంగా ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుని అనుగ్రహం పాఠకులందరిపై ప్రసరించాలని ఈ నెల ముఖచిత్రం.

# గమనిక

శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ మెంబర్‌గా చేరండి ప్రపత్తి శ్రీసన్నిధానం, ఆధ్యాత్మిక మాస పత్రికను పొందండి.

ప్రపత్తి శ్రీసన్నిధానం, సలహాలు, సూచనలు, చిరునామా మార్పులు, నూతన మెంబర్స్ కావడానికి ఇ–మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:
prapatti.srisannidhanam9@gmail.com

మాసపత్రిక చందా వివరముల గురించి సంప్రదించ వలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323 (ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)




**సంప్రదించండి**
**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

–ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

– ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 12 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి ఫిబ్రవరి 2025 వెల : 30

## లోపల

04.సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
06.శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
08.శ్రీపతిస్తుతి - మంచిమాట
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు
09.శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి
10.భగవద్గీత
శ్రీమాన్ శ్రీ సాతులూరి గోపాల కృష్ణమాచార్యులు
12.దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు
14.భాగవతంలో భగవంతుని అవతారగాథలు
శ్రీమతి తిరుమల నీరజ
15.ప్రయత్నం - ప్రార్థన
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు
16.సూర్యోపాసన - ఆరోగ్యం
శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు
18.మాఘ మాస మహిమ (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
20.జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
21.శ్రీహరి అతిమానుష చేష్టితాలు
శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు
22.గోదా వైభవము
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
23.శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
25.జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు
26.ఆధ్యాత్మిక సేవలో శ్రీరాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్
28.ఋషివాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా.యం.టి. ఆళ్వార్ స్వామి.
29.వానమామలై చరిత్ర, శ్రీమతి వనం ఉషారాణి
30.తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు
35.బాలవిజ్ఞానం, శ్రీమతి విజయ కందాళ
36.శ్రీసన్నిధి పదకేళి, శ్రీమాన్ శ్రీ ఆచార్య శ్రీవత్స

నెలవారిపంచాంగం, పుస్తక పరిచయం, మనదేవాలయాలు, ఆధ్యాత్మిక వార్తలు

**సంపాదక మండలి**

**వొద్దిపర్తి రామచంద్రమూర్తి** చీఫ్ ఎడిటర్
**సముద్రాల శారద** హానరరీ ఎడిటర్
**డింగిరి శ్రీనివాసమూర్తి** మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

**శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక**
**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య**
**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు**

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# జాతిని జాగృతం చేసిన హైందవశంఖారావం



కులాలకతీతంగా లక్ష్యసాధనకోసం జాతి సంఘటితమయిన క్షణం మరుపురాని సన్నివేశం! హైందవ శంఖారావంలో విజయవాడ వేదికగా ఇటీవల ఆవిష్కృతమయింది!! సంస్కృతి సంప్రదాయాలు, ఆలయాల పరిరక్షణకోసం విశ్వహిందూ పరిషత్ పిలుపుమేరకు అందరూ ఒక వేదిక మీద కలువడం అద్భుతం! భారతదేశం నలుమూలల నుండి లక్షలాది మంది ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చినా... ఏర్పాట్లు ఘనం, అపశృతులు దొర్లకుండా అడుగడుగునా అందరూ క్రమశిక్షణతో మసలుకోవడం సంస్కృతీ సంప్రదాయాలు, ధర్మనిష్ఠపై వారికి ఉన్న ప్రగాఢ నమ్మకం అనిచెప్పవచ్చు. హైందవ శంఖారావం సభ అయిపోయింది! విజయవంతం అయింది అని అనుకుంటే చాలదు గ్రామస్థాయినుంచి ఇదే ఐక్యతను కొనసాగించాలని ఉద్యమించాలని సభలో పెద్దలు పిలుపు నిచ్చారు. మన బతుకులు బాగుండాలంటే ఆలయ వ్యవస్థ బాగుండాలి. ఆలయాలు బాగున్నప్పుడే, అవి ఉన్న గ్రామాలు, పట్టణాలు, తద్వారా దేశం బాగుంటుందన్నది వాస్తవమని, దీనిని మన సనాతన ధర్మం చెప్పింది. ఇదేవిషయాన్ని వక్తలు పరిపరి విధాలుగా చెప్పారు. ఆలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలి అంటూ గ్రామంలో చెట్టు కింద గ్రామదేవత గుడి అయినా, పెద్ద గుడి అయినా అక్కడ పూజా విధానాలు నిర్ణయించే పెద్దలు ఉన్నారు. వారు నిర్ణయించిన పద్ధతులకు అనుగుణంగా నిర్వహించాలి. ఆలయాలకు వేల ఎకరాల ఆస్తులు ఉన్నాయి. ఇవాళ అవి ఆక్రమణలకు గురయ్యాయి. 1996లో సుప్రీంకోర్టు ఒక నిర్ణయం చేసిందని గుర్తుచేశారు. ఆలయపు ఆస్తి ఎక్కడున్నా, ఎన్ని చేతులు మారినా అది తిరిగి ఆలయానికే చెందాలని, ఆక్రమణలను తొలగించాల్సిందే అని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది అని, కాని అది అమలులోకి రాలేదని సభగుర్తు చేసింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది. ఆక్రమించుకున్న ఆలయాల ఆస్తులు ఎన్ని చేతులు మారినా తిరిగి ఆలయాలకే చెందాలన్నది సుస్పష్టం. సనాతన ధర్మ పరిరక్షణకోసం, ఆలయాల ఆత్మగౌరవాన్ని నిలపడంకోసం ఆత్మవిశ్వాసంతో దీక్షాకంకణ బద్ధులై తరలివచ్చిన లక్షలాది హిందూలకు పీఠాధిపతులు, ధర్మపరిరక్షణ సంస్థ ప్రతినిధులు, వక్తలు వివిధ అంశాలను గుర్తుచేశారు. సనాతన సంప్రదాయాలను, మన చరిత్రను తప్పుదారి పట్టించే సంఘటనలు, ఇతివృత్తాలను గుర్తుచేస్తూ తప్పుచేసిన వారిని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, ఆలయాల సంరక్షణకు ముందుకు రావాలని హైందవ శంఖారావంలో పిలుపునిస్తే, మరోవైపు సెక్యులర్ మసుగులు వేసుకున్న కుహనా వ్యక్తులు, నాస్తికులు ఉలిక్కిపడ్డారు. హేతువాదులు భుజాలు తడుముకున్నారు. మతాంతరీకరణలవల్ల దళితులు, వనవాసీలు 80 శాతం మంది నష్టపోయారని, వనవాసీలు మాట్లాడే 700 భాషలు కనుమరుగవుతున్నాయని వక్తలు ఘోషించారు. జాతికి సంబంధించిన వీరిని దెబ్బతీస్తున్న యత్నాలు కొనసాగుతున్నా యన్నది వాస్తవం. శంఖారావం సభ ముగిసిన తరువాత వాస్తవాలు పతాక శీర్షికల రూపంలో ప్రజల ముందుకు అన్ని వార్తల్లా వాస్తవాలుగా రాలేదు కానీ, విషం చిమ్ముతున్న వ్యతిరేక వార్తలు మీడియారూపంలో ఇంటర్ నెట్‌లో కనిపిస్తున్నాయి. వాస్తవాన్ని వక్రీకరిస్తున్న వారి వ్యాఖ్యానాలు వింటుంటే మనస్సు కలచి వేస్తుంది. ఇంటా బయట సంయమనంతో నడుచుకుంటున్నవారంటూ అన్యాయం జరిగింది మొర్రో న్యాయం చేయండన్నట్లుంది. శాంతియుతంగా, సంయమనంగా గోడు వెళ్లబుచ్చుకుంటే అన్యాయం జరిగింది అంటూ వ్యతిరేక శక్తులను రెచ్చగొట్టేలా సమాజంపై మీడియా వార్తలు ద్వారా గుప్పించడాన్ని చూస్తుంటే వాస్తవానికి మసిపూసి మారేడు కాయ చేస్తున్న చందంగా ఉంది. హైందవశంఖారావం సభకోసం ఎందరో కాలినడకలో, మరెందరో తమతమ వాహనాలలో, మరికొందరు ప్రత్యేక రైళ్లలో తరలి వచ్చారు. తమతమ ప్రాంతాలనుంచి బస్సులలో వచ్చిన వారు ఉన్నారు. ఇలా వచ్చిన వారిలో మతాధికారులు, ధర్మపరిరక్షణకు కంకణ బద్ధులైనవారు, కార్యకర్తలు, యువకులు, నడవలేని వృద్ధులు ఉన్నారు. అందరి మాటా ఒక్కటే! “ఆలయాలని సంరక్షిద్దాం”! సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు సమసమాజ శ్రేయస్సునకు అంకితమవుతామన్న భావన వారిలో కనిపించింది. సభ జరుగుతున్నంత సేపూ మొక్కవోని క్రమశిక్షణతో మండుటెండలో వేచిఉన్న ధర్మపరిరక్షణ సైనికుల్లా వారంతా కనిపించారు.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**మాఘమాసం 30-01-25 శుక్లపక్షంతో ప్రారంభమై 28-02-25 వరకు, 01-03-25 నుండి ఫాల్గుణమాసం**

06-02-2025 వరకు శ్రావణ కార్తె, 07-02-2025 నుండి 18-02-25 వరకు ధనిష్ఠ కార్తె, 19-02-2025 నుండి 4-03-25 వరకు శతభిష కార్తె, **పండుగలు:** 03-02-25 వసంత పంచమి, 04-02-25 రథసప్తమి, 08-02-25 భీష్మైకాదశి, సర్వేషాం ఏకాదశి, విష్ణు సహస్రనామ జయంతి, 16-02-25 సంకష్టహర చతుర్థి, 19-02-25 శివాజి జయంతి, 24-02-25 సర్వేషాం ఏకాదశి, 26-02-25 మహా శివరాత్రి, 28-02-25 అమావాస్య.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల మిశ్రమ ఫలితాలుంటాయి. ఆదాయమునకు మించిన ఖర్చులు. శుభ మూలకంగా ఖర్చగును. గృహంలో వివాహాది శుభకార్యాలు.



**వృషభం:** ఈ నెల మీమాటకు ఎదురు లేదు. అన్నింటా మీదే పైచేయి. గృహంలో శుభకార్యాలు జరుగును. కోర్టు వ్యవహారములు మీకు అనుకూలత. సంతాన సౌఖ్యం, కుటుంబంలో సౌఖ్యం.



**మిథునం:** ఈ నెలలో అనుకూలంగా ఉండుటచే అన్ని రంగములలో మీదే పై చేయి. గృహములో వివాహాది శుభ కార్యములు జరుగును. సంతోషంగా, ఉల్లాసంగా ఉంటారు.



**కర్కాటకం:** ఈ నెల మిశ్రమ ఫలితాలే ఉండును. ఆరోగ్య ఇబ్బందులు, ఊహించని పరిణామాలు, ఆందోళన కల్గించు సంఘటనలు, స్థానమార్పులు



**సింహం:** ఈ నెల కొంతమేర పర్వాలేదు. చేయు వృత్తి వ్యాపారములందు అనుకూలత, సంతృప్తి, ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు.



**కన్య:** ఈ నెలలో శుభా శుభ మిశ్రమంగా ఉండును. కొందరికి యోగం, మరికొందరికి అనయోగం చేయును. వృత్తి వ్యాపారములందు రాణింపు. ఇబ్బందులు తప్పవు.



**తుల:** ఈ నెలలో అనుకూలంగా ఉండుటచే అన్ని రంగముల వారికి లాభమే. ఆదాయం బాగుండును. గృహంబులో శుభ కార్యములు, నూతన కార్యములకు శ్రీకారం చుట్టెదరు.



**వృశ్చికం:** ఈనెల అన్నిరంగాల వారికి ఆర్థికంగా బాగుండును. ఆరోగ్యం బాగుండును. ఆదాయమునకు లోటుండదు. నూతన కార్యములకు శ్రీకారం చుట్టెదరు. గతంలో ఉన్న అనేక సమస్యలు పరిష్కారమగును.



**ధనుస్సు:** ఈ నెల కార్యాలు సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. గృహ నిర్మాణాలు కలసి వచ్చును. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం బాగుండును. గతంలో నిలచిపోయిన పనులు పూర్తి, ఆకస్మికంగా కొన్ని సమస్యలు వచ్చును.



**మకరం:** ఈ నెలలో అన్నివిధాలుగా అన్నిరంగాల వారికి యోగమే. చేయు వృత్తివ్యాపారాలందు లాభం. ఆరోగ్యం బాగుండును. ఆర్థికంగా బాగుండును.



**కుంభం:** ఈ నెలలో చికాకులు కలిగించే సంఘటనలు. ఆరోగ్యం బాగుండును. అన్నింటా అపజయం. ఏమి మాట్లాడినా విరోధమే. చిక్కులు.



**మీనం:** ఈ నెల మానసిక సమస్యలు తప్పవు. మనఃశ్శాంతి ఉండదు. శారీరక సుఖం లోపించును. ఆరోగ్యభంగాలు తప్పవు.

### వసంత పంచమి

మాఘ శుద్ధ పంచమి నాడు వసంత పంచమి. సరస్వతీదేవి జన్మించిన రోజు. ఈ పండుగ రోజు యావత్ భారతదేశంలో విశేషముగా సరస్వతి దేవికి పూజ జరుపుకుంటారు. వసంత ఋతువు ప్రారంభమగును. సర్వవిద్యలకూ ఆధారం వాగ్దేవే. పుస్తకాలు, కలాలు అమ్మవారి దగ్గర పెట్టి ఆరాధిస్తారు. సంగీత నృత్య సాహిత్యాలకు కూడా ఈ దేవీయే మూలం. జ్ఞానప్రాప్తి కోసం ఆరాధించమని బ్రహ్మవైవర్తపురాణం చెప్తోంది. ఈనాడు విష్ణువు పూజింపవలెను. ఈనాడు సరస్వతిని ఆరాధించే విధివిధానాలను నారదునకు శ్రీమన్నారాయణుడు వివరించినట్లు దేవీ భాగవతం చెప్తోంది. నేతితోకూడిన వంటలను, నారికేళము, అరటిపండ్లను చెరకును నివేదన చేస్తారు. అహింసకు అధినాయిక సరస్వతిదేవి. సరః అంటే కాంతి. కాంతినిచ్చేది కనుక సరస్వతి అయింది. అజ్ఞాన తిమిరాంధకారాన్ని దూరం చేసి విజ్ఞాన కాంతికిరణ పుంజాన్ని వెదజల్లే దేవత సరస్వతీదేవి.

| మంచి రోజులివిగో... | ఫిబ్రవరి నెల శుభ ముహూర్తములు **2,3,7,10,13,14,15,16,17,19,20,22,23,** |
|---|---|

# శ్రీరామానుజ సుధామాధురి

## మహాపురుషుల నడవడియే సంప్రదాయపు ఒరవడి



**– శ్రీమతి సముద్రాల శారద**

మహా పురుషులైన వారి చిత్తము, వృత్తి, నడవడి ఏదైనా అది ఒక గొప్ప విశేషతను కలిగి ఉంటుంది. మహనీయుల వ్యక్తిత్వం ఒక్కో సంఘటనలో, ఎన్నో సన్నివేశాలలో వారు ప్రవర్తించిన తీరు సామాన్యులను ఆశ్చర్యంలో ముంచెత్తు తుంది. అదే ఒక ధర్మంగా, సదాచారంగా ప్రాచుర్యం పొందుతుంది. ఒక జీవన విధానమై, సిద్ధాంతమై పరిణమిస్తుంది. సంప్రదాయంగా కూడా పరిమళిస్తుంది. మేధావులై పరిశీలించినప్పుడు అదే వేద విహిత ధర్మంగా అవగతం అవుతుంది. అదే సమాజ హితము అనే సత్యం కూడా గోచరిస్తుంది.

భగవత్ రామానుజుల చరిత్ర పరిశీలించినప్పుడు వారి ప్రవర్తన వారి ఉపదేశములతో పరిపక్వత పొందిన శిష్యుల నడవడి కూడా విశేషంగా కనిపిస్తుంది. వైష్ణవత్వములో ప్రధానముగా తెలియజేసే దయాళుత్వం గోచరిస్తుంది.

మానవులై లోకోద్ధరణకై అవతరించిన మహాపురుషుల దివ్య పార్థివ దేహాలకు జరామరణములు తథ్యమైనను వారి భావజాలం హృదయాంశలు బోధనలు చూపిన మార్గాలు మానవజాతికి గొప్ప సంపదలుగా నిలిచిపోతాయి. ఉత్తమ జీవన మార్గదర్శనం చేస్తాయనడంలో సందేహం లేదు.

ఆ విధంగానే భగవద్రామానుజులు చేసిన ఆధ్యాత్మిక సంస్కరణలు భగవత్ ఆరాధన విధానాలు అన్ని నేటికీ అనుసరించబడుతున్నాయి. తత్ ప్రయోజనాలను సకల మానవాళి పొందగలుగుతున్నది కూడా !

వేద వేదాంతముల గమ్యము ముక్తి, మోక్షము, భగవద్ అనుభవం. ధ్యానోపాసనా భక్తి విధానముల చేతనే శరణాగతి దీక్ష చేతనే అది సాధ్యం అనే సత్యాన్ని వారు సిద్ధాంత, వాఙ్మయముల ద్వారా బోధించారు. కఠిన నియమ నిష్ఠలతో కూడిన వైదిక ధర్మాన్నుంచే 'దధి చిలికి మృదువైన వెన్న తీసినట్టు' సకల జనహితమైన సూక్ష్మధర్మాలను ఆవిష్కరించారు. వారి మృదువైన అంతరంగాన్ని దయాళు త్వాన్ని బహిర్గతం చేశారు. ఆచార్యులైనవారు కృపామాత్ర ప్రసన్నులై(దయతో) ఉండాలనే సంప్రదాయాన్ని ఏర్పరిచారు.

భగవద్ రామానుజులను కూరేశుల వంటి జ్ఞానులు ఉత్తములయిన శిష్యులందరూ ఆశ్రయించిన తర్వాత వారి గురువైన పెరియనంబి వారు మార్నేరి నంబి అనువారికి అంత్యసంస్కారాలు చేసి భగవద్రామానుజులకు అందులోని ధర్మసూక్ష్మాన్ని తెలియజేస్తారు. (కథానుక్రమంగా ఆ విషయాలు తెలుసుకుందాము) తదనంతరం ఒకరోజు కరుణాంతరంగులైన భగవద్రామానుజులు వీధిలో పోతున్న ఒక మూగవానిని తన ఇంట్లోకి తీసుకొని వెళ్లి తనను గురువుగా రక్షకంగా భావించుమని చెప్పి, మంత్రోపదేశం చేశారు. సైగలతో తన శరీరమును తాకించి కరుణించారు. "మూక ముక్తి మార్గ ప్రదాయకాయ నమః" అని వారి దివ్య నామము. తలుపు సందులో నుండి ఈ దృశ్యాన్ని చూసిన కూరేశులు ఎంతో ఆశ్చర్యపోయారు. మహనీయుల మహిమ ప్రవర్తన ఒక సంప్రదాయమై నిలుస్తుంది. నేటికీ శ్రీపెరుంబుదూరు వంటి దివ్య దేశాలలో మహిమాన్వితమైన వారి అర్చామూర్తి ముందుకు వికలాంగులైన (మూక అంధ) బాలలను దర్శనానికి తీసుకొని వస్తారు.

అలాగే మరొకసారి ఒక మూగవాడు కనపడకుండా పోయి రెండు సంవత్సరముల తర్వాత శ్రీకంచిలో మాట్లాడుతూ వీధిలో తిరుగాడుతున్నాడు. తాను క్షీరాబ్ధినాథుని దర్శించి వచ్చానని, భగవద్రామానుజులు విశ్వక్సేనుల అవతారమే! అని చెప్పేవాడట. ఇలా అందరిని ఉద్ధరించే హృదయ మార్దవం యతి రాజులది.

వారి శిష్యులుకూడా ప్రేమాతిశయంతో, ఆర్తితో గురువును రక్షించాలని ప్రవర్తించిన విధం విశేషమైనది. గురువునే కాదు భగవంతుణ్ణి (భగవన్ మూర్తులను) దేవాలయాలను కూడా

# శ్రీరామానుజ సుధామాధురి



రక్షించే ప్రయత్నంలో వారి ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుల చరిత్రలు తెలుసుకుంటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది.

**“శిష్యైః ఉవాస రంగే ముదితో యతీశః”** అని సంతోషంగా శిష్యులతో కూడి శ్రీరంగ క్షేత్రమందు రంగనాథ ఆరాధనా విధులను నియమబద్ధంగా నిర్వహింపజేస్తున్నారు భగవద్రామానుజులు. ఆసమయంలో కొందరు అర్చకులు కీడు తల పెట్టారు. నిత్యం భిక్ష స్వీకరించే యతిరాజులకు భిక్ష సమర్పించే ఒక గృహిణి చేత విషం పెట్టించాలని దురాలోచన చేశారు. కానీ తన భర్త మాట కాదనలేక ఆ పరమసాధ్వి విష మిశ్రితమైన భిక్ష సమర్పించింది. కానీ

**“దత్వా సాధ్వీ యతీంద్రాయ కృత్వా పాదాభివందనం**
**విలేఖ్య నృఖ దారాభిః యతీంద్ర పద పంకజం”**

ఆమె యతీంద్రులకు భిక్షను సమర్పించి వారి పాదములకు నమస్కరించి ఆ విషయాన్ని తెలియపరుస్తుంది. యథార్థం తెలుసుకొని ఆ ఆహారాన్ని వారు పరిత్యజించారు. మరొకసారి భగవంతుని తీర్థమునే విష మిశ్రితముగా పెట్టగా స్వీకరించారు.

**“హరి పాదోదకాక్రాంతం నిర్వీర్య మభవద్విషం”** అని భగవత్పాదోదకమైన పవిత్ర తీర్థం భగవద్ అనుగ్రహంతో నిర్వీర్యమై యతీంద్రులకు ఏ అపకారము కలిగించలేదు.

ఆ కాలంలోనే **“తతస్త దాత్రేయనతార్తి హర్తా యతీశ పాదాంబురుహం ప్రపన్నః”** ( యతీంద్ర వైభవం) ఆత్రేయ కులజులైన ప్రణతార్తిహరులని ప్రసిద్ధులైన కిడాంబి యాచ్చాన్ అను శిష్యులు కూడా యతీశ్వరులను ఆశ్రయించారు. ఆచార్య కైంకర్యము ఆచార్య నిష్ఠయే చరమోపాయము. అనేది శ్రీవైష్ణవ సంప్రదాయంలోని ప్రధాన లక్ష్యం. అలా వీరు ఆచార్యులైన భగవద్రామానుజుల యెడ అత్యంత భక్తిశ్రద్ధలు కలవారు.


విషప్రయోగ సంఘటనతో కొంత కలత చెందిన భగవద్రామానుజాచార్యులు ఉపవాస వ్రతాన్ని స్వీకరించారు. ఈ వార్త తెలుసుకొని వారి ఆచార్యులైన గోష్ఠీపూర్ణులు వారిని కలుసుకోవడానికి వచ్చారు. కావేరి స్నానం చేసి శిష్య బృందంతో తిరిగి వస్తున్న భగవద్రామానుజులను కావేరీ తీరంలోనే కలుసుకున్నారు. ఎదురుగా వచ్చిన గురువు గారిని చూడగానే ఎండ వేడిమి కూడా లెక్క చేయక ఇసుక తిన్నె పైననే సాష్టాంగ దండ ప్రణామం చేశారు. ప్రణామాన్ని స్వీకరించేవారు అనుమతినీయందే లేచి నిలువటం అనుచితం కనుక వారు అలాగే వేడి ఇసుకపై పడుకొని ఉన్నారు.

సూర్యతాపదగ్ధమైన ఉష్ణ సైకతముపైన తమ ఆచార్యుల తిరుమేని బాధపడడం చూసి సహించలేక ఆర్తి చెందారు ప్రణతార్తిహరులు!. భగవద్రామానుజుల వెనువెంటే నిలిచి ఉన్న కిడాంబియాచ్చియాన్ (ప్రణతార్తిహరులు) దయాళువై కలత చెంది గోష్ఠీ పూర్ణులతో “చోళ రాజు పంపితే గురువు గారిని కష్టపెట్టడానికి వచ్చారా!” అని బాధపడుతూ వెంటనే

**“ఉధృత్యోపరి నిక్షిప్య స్వస్యైవా2శు కృతాదరః**
**ప్రాణతార్తిహరో తస్థా తదంతః తప్త సైకతే”** తాను వేడి ఇసుకపై పడుకొని గురువుగారిని లేపి వారి దేహాన్ని తనపై వేసుకున్నారు. జరిగిన సంఘటనల నేపథ్యంలో భగవత్ రామానుజుల రక్షణ గురించి విచారిస్తున్న గోష్ఠీపూర్ణులకు చక్కని ఆలోచన కలిగింది. నాటినుండి తళిగ కైంకర్యం (వంట చేసే) పనిని కిడాంబియాచ్చాన్కు అప్పగించి నియమించారు. (మిగతా 13 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి - సుభాషితం

## మంచి మాట



**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు**

### పరత్వాది పంచక స్తుతి

**ఆమోదే భువనే ప్రమోద ఉత సమ్మోదే చ**
**సంకర్షణం**
**ప్రద్యుమ్నం చ తథా2నిరుద్ధ మపి తాన్**
**సంహార సృష్టి స్థితీః**
**కుర్వాణాన్ మతిముఖ్య షడ్గుణ వరైః**
**యుక్తాన్ త్రియుగ్మాత్మకైః**
**వ్యూహాధిష్ఠిత వాసుదేవ మపితం**
**క్షీరాబ్ధి నాథం భజే॥**

ప్రతి పదార్థము: సంకర్షణం = సంకర్షణుడు, ప్రద్యుమ్నం = ప్రద్యుమ్నుడు, తథా = అట్లే, అనిరుద్ధంచ = అనిరుద్ధుడు అన బడే ముగ్గురు మూర్తులు, మతి ముఖ్య షడ్గుణ వరైః = జ్ఞానం మొదలైన శ్రేష్ఠమైన 6 గుణములు, త్రియుగ్మాత్మకైః = రెండు రెండు జంటలు అను గుణములను ప్రధానంగా, యుక్తాన్= గలవారై, తాన్ = అటువంటి, సంహార,సృష్టి స్థితీః = సంహార సృష్టి స్థితుల, కుర్వాణాన్ = చేయుచున్న వారై, ఆమోదే = ఆమోదం అను, ప్రమోదే = ప్రమోదం అను, సమ్మోదే = సమ్మోదం అనే, భువనే = భువనమందు 3 లోకములలో నున్నవారై, వ్యూహాధిష్ఠిత వాసుదేవం అపి = ఈ వ్యూహ మూర్తులు ముగ్గురికిని అధిష్ఠానమగు వ్యూహ వాసుదేవుడు, తం = అట్టి, క్షీరాబ్ధినాథం = పాల సముద్రమున పవళించియున్న వ్యూహ వాసుదేవుని, భజే = సేవించుచున్నాను.

తాత్పర్యము : పర వాసుదేవుడు పరమపదంలో నుంటే వ్యూహావతారం పాలసముద్రంలో వుంటుంది. ఇది అవతార క్రమంలో రెండవది. ఈ వ్యూహ వాసుదేవుడే సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపంగా ముగ్గురు మూర్తులైనారు. అంటే ఈ ముగ్గురికి మూలకందమన్నమాట. ఈ ముగ్గురు ఒక్కొక్క లోకంలో నుంటారు. సంకర్షణులు ఆమోదం అనే లోకంలో, ప్రద్యుమ్నుడు ప్రమోదమనే లోకంలో, అనిరుద్ధుడు సమ్మోదమనే లోకంలో వుంటారు. ఉండి ఒక్కొక్కరు జ్ఞానశక్త్యాది 6 గుణములలో రెండేసి చొప్పున గుణములతో ప్రకాశించు చుంటారు. వాళ్లేమి చేస్తారు? అంటే సంహార, సృష్టి, స్థితులను చేస్తారు. అనగా పాలసముద్రంలో నున్న వ్యూహ వాసుదు సంకర్షణ రూపం గలిగి ఆమోద లోకంలో నుండి 6 గుణములలోని రెండు గుణములను గ్రహించి లోక'సంహార' కార్యం చేస్తాడు. అట్లే ప్రద్యుమ్న రూపంతో ప్రమోద లోకంలో చేరి యుండి సృష్టి కార్యమును నిర్వర్తించుచుంటాడు. అనిరుద్ధ రూపంలో నుండి 6 గుణములలోని రెండు గుణాలను గ్రహించి సమ్మోదం అనే లోకంలో చేరియుండి లోకరక్షణ కార్యమును చేస్తుంటాడు. అనగా 'సంకర్షణుడు' 'జ్ఞానశక్త్యాది 6 గుణములలోని 2 గుణములను గలిగి ఆమోదలోకంలో యుండి సంహారము, ప్రమోదం లోకంలో నుండి. ప్రద్యుమ్నుడు 6లోని 2 గుణములు గ్రహించి సృష్టి. అనిరుద్ధుడు 6 లోని 2 గుణములను తీసుకొని రక్షణను సమ్మోదమనే లోకంలో నుండి చేస్తుంటారు.

ఈ విధంగా సంహార, సృష్టి, స్థితులను చేసేవాడు వ్యూహ వాసుదేవుడే నన్నమాట. పై 3 అవతారాలకు మూలకందము. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అని 4గా భావించడం వుంది. కాని వ్యూహవాసుదేవుడు 3 రూపాలుగా మూడు లోకాలలో చేరి 3 కార్యములను నిర్వహించు చున్నాడని ఆ వ్యూహవాసుదేవుడు పాలసముద్రంలో పవళించి యుంటాడు అనే విషయాన్ని ఈ రెండవ శ్లోకంలో వాచ్య వరద దేశికులు మనకు తెలుపుచున్నారు. ఇంకా వివరణ కావాలంటే గురుముఖతః వినాల్సిందే. ఎందుకంటే అతి గంభీరమైన విషయాన్ని సులభంగా అందాలనే భావంతో ఈ స్తుతి రచించబడింది. ఏదైనా 'గురువు లేని విద్య గుడ్డి విద్య' అన్నారు గదా!

★

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**



(క్రిందటి సంచిక తరువాయి)

**-: వేధానిర్ణయము :-**

**శ్లో॥ దిశాయాం విదిశాయాంచ**
**వాస్తు వేధ విశోధనం।**
**జీర్ణేచ నూతనేచైవ**
**వేధాదోషం విసర్జయేత్॥**

దిక్కుల యందు, విదిక్కుల యందు, వేధా దోషమును శోధించ వలయును. పురాతన గృహమునకు వేధాదోషమున్న వెంటనే ఆ దోషమును సరిచేసుకోవలయును. నూతన గృహ నిర్మాణము చేయువారు వేధాదోషమును గమనించి దోషములు లేకుండా ఉండునట్లు శాలలను, సౌధములను, డాబాలను నిర్మించుకొన వలయును. ఈ వేధా దోషములు గృహములకు దుష్ట ఫలములను కలుగచేయుటలో సమర్థమైనవి. కావున జాగ్రత్తగా వేధా దోషములను జ్ఞాపక ముంచుకొని గృహములను నిర్మించిన శుభములు కలుగును.

(అపరాజితపృచ్ఛ)

**శ్లో॥ అతః పరం ప్రవక్ష్యామి గృహాణాం వేధనిర్ణయం।**
**అంధకం రుధిరం చైవ కుబ్జం కాణం బధీరకం।**
**దిగ్వక్త్రం, చిపిటం చైవ వ్యంగ్యంచ మురజంతథా।**
**కుటిలం కుట్టకం చైవ సుప్తంచ శంఖపాలకం।**
**కటంచ తథా కంకం కైకరం షోడశస్మృతం॥**

వేధా దోషములు 16 విధములు అవి క్రమముగా అంధకము. రుధిరము, కుబ్జము, కాణము, బధిరము, దిగ్వక్త్రము, చిపిటము, వ్యంగ్యము, మురజము, కుటిలము, కుట్టము, సుప్తము, శంఖ పాలకము, వికటము, కంకము, కైకరము అను వేధా దోషము లున్నవి.

**అంధక వేద** :- గృహమునకు ముఖ ద్వారము నందు యిరు పార్శ్వముల యందు గవాక్షములు లేనట్లయితే **అంధకంచిద్రహీనంస్యాత్** శాస్త్రరీత్యా అంధకవేధ యందురు. **అంధకేరోగమతులంస్యాత్** అంధకవేధ పొందిన గృహము యజమానికి రోగ బాధలను, ఋణ బాధలను, సంతాన నష్టములను కలుగచేయును.

**రుధిర వేద :- రుధిరంచ విషమాంగకం** అను ప్రమాణమువల్ల యజమానికి గల గృహము పరిమిత మానముచే గృహనిర్మాణము చేయక విషమముగా నిర్మించుట వల్ల రుధిర వేధకల్గును. **రుదిరే2తి సారజం భయం** అను శాస్త్ర వచనము వల్ల యజమానులకు గృహమందు వుండు వారందరికి ఎల్లప్పుడు అతిసారము మొదలగు వ్యాధులను, భయమును కలిగించును.

**కుబ్జ వేధ :- హీనాంగంకుబ్జకంచైవ** అను ప్రమాణము వల్ల గృహమందు పెట్టిన ద్వారములు, గవాక్షములు మొదలగునవి గృహమానమునకు తగినట్లుండక తక్కువ పరిమాణము కల్గియుండుటవల్ల పొడవు, వెడల్పు, పొడుగు, ఎత్తు మున్నగునవి వుండక ఎక్కువ తక్కువ ప్రమాణములో యుండుట వల్ల కుబ్జ వేధాదోషము కల్గును. **కుబ్జే కుష్టాది రోగం స్యాత్** ప్రమాణ సూత్రము వల్ల గృహ యజమానికి అందులో వుండే వారలకు కుష్టు, క్షయ, ఉబ్బసము, పాండు మొదలగు అసాధ్య వ్యాధులను కలిగించును.

**కాణవేధ :- విచ్ఛిద్రందిశి కాణకం** అను ప్రమాణము వల్ల గృహమునకు యుండు సింహద్వారమునకు ఇరు పార్శ్వముల యందు గవాక్షములు లేకుండ ఒకే పార్శ్వము నందు ఒకే గవాక్షము యుండుటచే కాణమను వేధ కలుగును. **కాణకాకైక చక్షుషం** అను వచనము చొ॥న ఒకే నేత్రము గల వాడు కనుక వాస్తు పురుషునకు సహజముగ యుండ వలసిన నేత్ర సంఖ్యకు వ్యత్యస్తముగ యుండుట యణ కాణ శబ్దార్థము, గృహమునకు యుండవలసిన దిశలయందు సరియగునట్లు గవాక్షములు వుండక వ్యత్యస్తముగా గవాక్ష ములు వుండుటచే యీ కాణవేధా దోషము సంభవించును.

(మిగతా 11 వ పేజీలో)




# భగవద్గీత

శ్రీమాన్ శ్రీ సాతులూరి గోపాల కృష్ణమాచార్యులు



**దేశ కాల భేద రహితంగా సకల మానవజాతికి అమృతతుల్యమైనది, పారాయణగా, అర్థానుసంధేయంగా, అనుసరణీయంగా భారతజాతికి (వైదికులకు) ఒక పవిత్ర ధనం! గీతా శాస్త్రం! తరచినకొద్దీ తెలుసుకోవలసిన జీవిత రహస్యాలు ఎన్నింటినో ఉపదేశించే వేదసారం, మృత సంజీవిని, భగవద్గీత! ఆ ఉపదేశామృతాన్ని ఉదార కృపాసముద్రులు మధురవాక్ శిఖామణి, ఉపన్యాసదివాకర శ్రీ ఉ.వే శ్రీమాన్ సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి వారు స్వీయ వాగమృతవర్షిణిగా భగవద్గీతా రహస్యాలను "ప్రపత్తి శ్రీసన్నిధానం" పాఠకుల కోసం అందిస్తున్నారు.**

**గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః**
**యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాత్ వినిశ్రుతా**

ఇది భగవద్గీతా మహాత్మ్యాన్ని తెలుపేటటువంటి శ్లోకం. భగవద్గీత ఒక్కటి చదివితే చాలు. మిగతా అన్ని శాస్త్రాలు చదివి శ్రమపడాల్సిన అవసరం లేదు. ఎందుచేత? మనం తెలుసుకోవలసిన విషయములను సమగ్రంగా తెలుపే గ్రంథములు, శాస్త్రములు అనేకములు ఉన్నవి. ఇవన్ని చదవాలంటే ఇతర శాస్త్రముల సాహచర్యం కావాలి. ఒక్క భగవద్గీత చదివితే చాలు. మిగతా శాస్త్రాలు ఎందుకు అని శ్లోకానికి అర్థం. ఏమిటి భగవద్గీత గొప్పతనం?

మిగతా గ్రంథాలు అర్థపంచకాన్ని **స్వస్వరూపపరస్వరూప పురుషార్థస్వరూప ఉపాయస్వరూప విరోధిస్వరూపము** లను తెలిపేవే. ఏ గ్రంథం తెలిపినా సారాంశం ఇదే. అది వేదమైనా, ఇతిహాసమైనా, పురాణమైనా, వేదాంతులైనా, వేదవేత్త లైనా ఈ ఐదే విషయాలను తెలుపడం. కానీ తెలుపే శాస్త్రము లలో అన్నింటికంటే ఉత్కృష్టమైన శాస్త్రమేది? సాధారణంగా కాలం గడిచేకొద్దీ మానవులలో ఆయుః పరిమితి, గ్రహణ ధారణ సామర్థ్యం కూడా తరగటం వలన అన్ని శాస్త్రాలను ఔపోసన చేయగలిగినవారు వుండరు. కానీ ఈ శాస్త్రముల సారాంశమంతాకావాలి కొంతలో కావాలి. అంటే



భగవద్గీతయే దానికి ఆధారము. ఎవరైనా సరే అది శంకరులైన, రామానుజులైనా లేదా మధ్వాచార్యులైనా, ఎవరైనా భగవద్గీతనే ప్రధానమైన ప్రమాణంగా తీసుకొని తమతమ సిద్ధాంతములను లోకంలో ప్రవర్తింపచేశారు.

బ్రహ్మసూత్రకారుడైన వేదవ్యాసుడు కూడా తన బ్రహ్మ సూత్రములలో ఇంకో ప్రమాణము తీసుకొని చెప్పాలి, ఇది గట్టిగా నిర్ధారింపబడాలి అనుకున్నప్పుడు 'స్మృతేశ్చ' అని ఈ అర్థాన్ని స్మృతి కూడా చెపుతుందండి అంటారు. అక్కడ స్మృతి అనే మాటకి భగవద్గీతను తీసుకుని భాష్యకారులందరు కూడా ప్రమాణాన్ని చూపిస్తారు. స్మృతి అని భగవద్గీత శృతుల సారాంశము. స్మృతి అంటే శ్రుతిని స్మరించి చెప్పబడినది. వేదంలో చెప్పబడిన అర్థమే. ఒకమాట వేదంలో చెపితే అక్కడ పరిష్కారం చెప్పకపోవచ్చు. వేదం అనేది ఒక ప్రభు శాసనం లాంటిది. కనుక ప్రభువు బుజ్జగించి కారణాలు చెప్పి 'నాయనా ఇందువలన ఇలా చేయి' అని చెప్పడు. 'ఇలా చెయ్యి' అని చెప్తాడు అంతే! అంతేకాని ఇందువలన అని చెప్పడు. అలాంటిది వేదం అంటే! "యద్వేదాత్ ప్రభు సమ్మితాత్" అంటారు కదా!

ఋగ్వేదంలో ఒక వాక్యం వుంది "కేవలాభూతికేవలాహి" కేవలము అన్నమును తినువాడు పాపమును తినుచున్నాడు అని. వేదం చదువుకుంటే భోజనం మానెయ్యాలి. భోజనం చేస్తే పాపం

వస్తుంది అని చెప్తుంది. మరి ఎలా? మనందరికీ ఒక పేరు వుంది తెలుసునా? "గృహమేధి" వివాహం చేసుకున్న వాళ్లందరికీ గృహమేధి అని పేరు. 'మేధా' అనే శబ్దానికి హింసా! అని అర్థం. ఇంట్లో కూర్చుని హింస చేయవాడు అని అర్థం. మనమెక్కడ హింస చేస్తున్నామండీ? చీమకు కూడా అపకారము చేయము! మనము ఐదు రకాలైన పాపాలు చేస్తున్నాము. అవి పంచ సూనములు.

ఇంట్లోవుండి చేసే పాపములు ఐదు. ఏమిటవి అంటే? సాపాటు చేస్తున్నాము అంటే ఐదు పాపాలు చేసినట్టే! ఆ సాపాటు తయారు అవ్వాలంటే దానికోసం పాపాలు చెయ్యాలి. పచ్చడి ఎంత బాగా రుద్దితే అంత గొప్పతనము. అప్పుడు కొన్ని క్రిములు నశిస్తాయా? బియ్యాన్ని బాగా కడితే క్రిములు నశిస్తాయా? బాగా తుడిస్తే క్రిములు నశిస్తాయా? పొయ్యి వెలిగిస్తే కొన్ని క్రిములు నశిస్తాయా? నీళ్ల కుండ పెట్టినచోట కూడా క్రింద కొన్ని క్రిములు నశిస్తాయా? ఇలాంటి పాపములన్ని, **ఖండినీ పేషిణీ చుల్లీ ఉదకుంభీ చ మార్జనీ** ఇలాంటివి ఐదు పాపములు చెపుతుంది. ఎందుకు చేసావు ఇవన్ని? భోజనం కోసం చేసాము. ఇలా అన్ని పాపాలు భోజనానికి అంటుకుంటాయి. భోజనం ఎవరుతింటే ఈ పాపము వారికి అంటుకుంటుంది. ఇంతవరకే వేదం చెపుతుంది. మరి దానికి పరిష్కారం ఏమిటి? పరిష్కారం స్మృతి చెప్తుంది. స్మృతి అంటే 'భగవద్గీత'. భగవద్గీత ఇదే మాటను చెప్పి పరిష్కారం కూడా చెప్తుంది. ఏం చెపుతాడు కృష్ణ భగవానుడు భగవద్గీతలో! **తే త్వఘం భుంజతే పాపాః యే పచంతి ఆత్మకారణాత్** ఎవరైతే తమకోసమని వండుకొని తింటున్నారో వారు పాపములు తినుచున్నారు పాపాత్ములైనవారు. ఇది శృతి వాక్యానికి అనువాదం. ఈ అనువాదంతో సరిపోదు. మరి భగవంతుడు చేసే ఉపకారం? దానికి నివారణోపాయాలు సూచించింది. **యజ్ఞ శిష్టాశిన స్సంతో ముచ్యన్తే సర్వకిల్బిషైః** అంటే ఎవరైతే ఇంట్లో ఆరాధన చేసుకొని ఈ అన్నాన్ని భగవంతునికి నివేదన పెట్టి అప్పుడు తింటారో ఈ అన్నం పెరుమాళ్ళ కోసం కనుక వారికి పాపములు ఏవి వుండవు. స్మృతి ఏం చెప్పింది 'కేవలాదీన్" అని నేను తినటం కోసం కాకుండా, పెరుమాళ్ళ కోసం వండుతున్నాడు. వండినదాంట్లో తాను పుచ్చుకొంటున్నాడు. అది పెరుమాళ్ళ ప్రసాదం. ఆ ప్రసాదం పాపం అవదు.

(మిగతా వచ్చే సంచికలో)

★

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(9 వ పేజీ తరువాయి)

**కాణే2ంధత్వం ప్రజాయతే** యీ కాణవేధ చెందిన గృహము యజమానునకు అంధత్వమును, నేత్రరోగమును కలుగ చేయును. గృహము గుడ్డి, మూగ, మున్నగు లక్షణములు కల్గిన సంతతిని కలుగచేయును.

**బధిరవేధ:- పృథ్వీద్వారం బధిరం** అను లక్షణాను సారము గృహము యొక్క నేల మట్టమునకు పై భాగమునందు సింహ ద్వారము లేదా తదితర ద్వారములు గాని వుండక నెలమట్టమునకు దిగువన సింహద్వారము గాని ఇతర ద్వారములు వున్నచో బధిర వేధా దోషము సంభవించును.

**పృథ్వీద్వారే సర్వదుఃఖం మరణాంచ ప్రజాయతే** బధిర వేధా దోషముగల గృహము యజమానునకు సమస్తమైన దుఃఖములను, కష్టములను, మరణమును, నష్టమును కలిగించును.

**దిగ్వక్ర వేధ:- రంధ్రం వికీర్ణం దిగ్వక్రం** అను ప్రమాణము వల్ల గృహమునకు గాని, నాల్గుదిక్కుల యందు గాని, లోపల భాగము నందు గాని ద్వారమునకు ద్వార గవాక్షమునకు గవాక్షము పోటీ లేకుండా వరుస క్రమమును వదలి వ్యత్యస్తముగా గాని గవాక్షములున్న దిగ్వక్రమను వేధ సంభ వించును. **దిగ్వక్రే గర్భనాశస్స్యాత్** శాస్త్ర సారము దిగ్వక్రమను వేధాదోషము గల గృహము, గృహ యజమానికి, గృహ మందుండు వారలకు గర్భస్రావాదికములను, గర్భ నాశనమును, సంతాన నష్టమును కల్గించును.

**చిపిటకవేధ:- తుంగహీనంతు చిపిటం** అను ప్రమాణాను సారము గృహ ఆయాది మానమునకు సహజముగా వుండ వలసిన ఎత్తుకంటె తక్కువ ఎత్తుగా యున్న యెడల చిపిటకమను వేధాదోషము కల్గును.


**చిపిటేనీచసంగతి:-** శాస్త్ర ప్రమాణముచే చిపిటమను వేధాదోషము గల గృహము గృహ యజమానిని చోరునిగ, ద్యూత, మద్యపానాది దుర్వ్యసనము గలవానినిగ, నీచ జన సాంగత్యము కలుగచేయును.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)



# దాశరథి శతకము

*(భక్తరామదాసుగారి సత్కృతికి 'భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)*





## శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు


(గతసంచిక తరువాయి)

**శమక్షమాది శృంగారగుణాభిరామ!**

ఇది ప్రథమ పద్య ప్రసూనంలోని మూడవ సంబోధనము. అభిరాముడు అనగా మనోహరుడు అని అర్థము. రామ నామములోని ఆనందదములైన అన్నిగుణములు ఈ సంబోధనకూ వర్తిస్తాయి. విశేషించి 'అభి' అను ఉపసర్గ యొక్క చేరికచే ఆగుణములన్నింటిచే అందరి మనస్సులను ఆకర్షించు వాడనే విశేషార్థమును కలిగించినది.

**రూపౌదార్యగుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణమ్** అను శ్రీవాల్మీకి మహర్షి యొక్క మధుమయ ఫణితికి మనోజ్ఞమైన రూపమే 'అభిరామ' పదము.



'మన్నత్తుక్కు ఇనియానై' అని గోదాదేవి యొక్క శ్రీసూక్తికి భావమూలమిదియే. రామ పదమును స్మరించగనే అభిరామ పదము స్ఫురించును. అభిరామ యనగానే సకలకళ్యాణ గుణకరత్వము స్ఫురించును. గుణకరత్వము తోచగనే దాశరథి పదము స్ఫురణకు రావలెను. 'అభిరామ గుణాకర దాశరథే' యను ప్రతి వాది భయంకరం అణ్ణన్ స్వామి యొక్క శ్రీసూక్తి మన మనస్సుమనస్సును శ్రీరామ పాదార్పణము చేయించును.

దాశరథి అనేది శ్రీరామునికి ఇష్టమైన పేరు. శ్రీరామకథా పరిపుష్టమైన పేరు. ఈ భావప్రభావమే ఈ శతక నామమునకూ హేతువు. అంతటి మనోహరత్వమును ప్రకటించునదే ఈ అభిరామ సంబోధనము.

శ్రీరాముడు కేవలం మానవులను మాత్రమే కాదు సర్వచరాచర జీవులనూ ఆకర్షించు మనోహరుడే. **రామః కమల పత్రాక్షః సర్వసత్త్వ మనోహరః** అని హనుమంతుడు కీర్తించి సీతమ్మకు అనుగ్రహ పాత్రుడైనాడు. "తల్లీ! నీకెంతటి మనోహరుడో వానరుడనైన నాకూ అంతటి మనోహరుడే" అని హనుమ తనయందలి విశ్వాసమును ఇనుమడింప చేసి నాడు. శ్రీరాముని యొక్క మనోహరత్వమును గుర్తించి, వర్తించుటయే మనకు శ్రేయస్సును పొందించును. శ్రీరాముని గుణములన్నియు శృంగారములు అని రామదాసుగారనుట ఒకింత ఆశ్చర్యమును కలిగించ వచ్చును. నవరసములలో శృంగారము మొదటిరసము.

**శృంగార హాస్యకరుణా**
**రౌద్రవీరభయానకాః।**
**బీభత్సాద్భుతశాన్తాః చ**
**రసా నవసమీరితాః॥** తొమ్మిదవది అయిన శాంతమును మినహాయించి **శృంగారాదయోऽష్టౌరసాః** అని చెప్పిన వారున్నారు. వాత్సల్యమును కలిపి పదిరసములు అన్న సాహిత్యకారులూ ఉన్నారు. శృంగారాది శాంతాంత ములుగా రసములను పరిగణించుటయే వ్యవహార సిద్ధమై యున్నది. విభిన్నములుగా రసములను చెప్పిన వారందరును శృంగార రసమునకు ప్రాథమ్యమును, ప్రాధాన్యమును కూడ ప్రకటించి యున్నారు.

శృంగారమునకు రసరాజము అనిపేరు. అన్ని అలంకారములకు 'ఉపమ' ఎలా మూలమో అట్లే అన్ని రసములకును శృంగారమే మూలము యనినవారున్నూ కలరు. ఏది యేమైనను శృంగారము రస ప్రధానమైనది.

**శృంగం ప్రాధాన్యం ఇయర్తి ఇతి శృంగారః** అని నిర్వచనము. ఈ శృంగారమునకు రెండు నామాంతరములు కూడా యున్నవి. శుచి యని, ఉజ్జ్వలము యని. **శృంగారశ్శుచిరుజ్జ్వలః** అని అమరకోశకారుని మాట.

# దాశరథి శతకము

శృంగారము యను పేరు రస ప్రధానతను తెలుపుచుండగా శుచిరుజ్జ్వలములు రెండు ఆరసము యొక్క పరిశుద్ధిని, ప్రకాశబుద్ధిని తెలియజేయుచున్నవి.

భోజమహారాజు, శృంగార మొక్కటియే రసశబ్దమునకు తగినది. తక్కినవాటిలో రసత్వమనునది గతానుగతికమైనదే అని చమత్కరించినాడు.

**ఆమ్నాసిషుర్దశరసాన్ కవయో, వయం తు**
**శృంగారమేవరసనాత్ రస మామనామ।**

కవులయిన వారు పదిరసములుగా (వాత్సల్యమును కూడ చేర్చి) చెప్పుచున్నారు. కాని మేము ఆస్వాద యోగ్యతనుబట్టి శృంగారమును మాత్రమే రసముగా చెప్పుచున్నాము అని భోజునిమాట.

వీరము, అద్భుతము మొదలగు వాటియందలి రసము అను వ్యవహారము మఱ్ఱిచెట్టు మీద మహాభూతము యనునట్లు జనశ్రుతియే తప్ప శృంగారేతరములైన వన్నియు నీరసములే అని భోజుడు, తన శృంగార రసాభిరుచిని ప్రకటించినాడు.

**వీరాద్భుతాదిషు చ యేహ రస ప్రసిద్ధిః**
**సిద్ధా, కుతో2పి వటయక్ష పదా విభాతి**

శృంగారము అనునది స్త్రీ పురుషుల పరస్పర ప్రేమానురాగముల చర్యావిశేషముగా లోకప్రసిద్ధమే అయినను శృంగారము అనుపదమునకు అలంకారము శుభావహము అను విశేషార్థములును కలవు. సింగారము, సింగారించుకొనుట వంటి ఆలంకారిక సంబంధములైన పదములు మనకు అలవాటున యున్నవే కదా!

ఆలయ సంప్రదాయమును బట్టి ముఖ్యంగా శ్రీవైష్ణవ ఆలయములలోని అలంకార మండపమునకు శృంగార మండపము అనే పేరును గమనించినను శృంగారమనగా శోభావహమైన, శుభాస్పదమైన చర్య భగవంతుని గుణములన్నీ ఇటువంటి శుభశోభావహములగు శృంగారములే! కనుకనే శ్రీరామదాసుగారు శృంగార గుణములు అని కీర్తించినారు. శమక్షమాది గుణములన్నియు శృంగారములేయనుట సాభిప్రాయకమే తప్ప కవితాకామన కాదు. శృంగార గుణములనగా కళ్యాణ గుణములనియే తాత్పర్యము.

అదియునుగాక ఈ శృంగారరసము విష్ణుదేవతాకమని నాట్య సాహిత్య శాస్త్రముల నిర్ణయము.

**రసోహిశ్యామవర్ణో2యం శృంగారో విష్ణుదైవతః** అని ప్రమాణము. హాస్యరసమునకు ప్రమథగణములు, కరుణ రసమునకు యముడు, రౌద్రరసమునకు రుద్రుడు, వీరరసమునకు ఇంద్రుడు, భయానకరసమునకు కాలుడు, బీభత్సరసమును మహాకాలుడు, అద్భుతరసమునకు బ్రహ్మ, శాంతమునకు విష్ణువు అధిదైవతములుగా ఆయా శాస్త్రములు తెలియజేయుచున్నవి.

ఏవిధముగ మనము పరిశీలించినను శృంగారము అనగా అలంకార ప్రియుడైన శ్రీనాథుని గుణాకరమైనది.

ఆ విధముగా అసంఖ్యాకములైన కళ్యాణగుణములచే అందరి మనస్సులను ఆకర్షించి, ఆనందింప చేయువాడు శ్రీరాముడే. అసంఖ్యాకములు అనే విషయమును శ్రీరామదాసుగారు 'శమ క్షమాది' అనే మాటలోని ఆది శబ్దము ద్వారా తెలియజేయుచున్నారు.

**యథా రత్నాని జలధేః అసంఖ్యేయాని పుత్రక।**
**తథా గుణా హ్యనంతస్యా హ్యసంఖ్యేయా మహాత్మనః॥**

అని మత్స్యపురాణంలోని మాట. ఆ అనంతుని యొక్క గుణానంత్యమును గురించి ఆది శబ్దము యొక్క వివృతిగా వచ్చే సంచికలో తెలుసుకునే ప్రయత్నంచేద్దాము.

# శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి)

కంచి వరదరాజ స్వామి తిరునామము ప్రణతార్తిహరులు అని పేరు గల వీరు కూడా కాంచీపుర వాసులే అని ప్రసిద్ధి. (వారి తర్వాత ఆచార్యుల) పూర్వాచార్య వ్యాఖ్యానములలో, యతిరాజ వైభవాన్ని తెలిపే అనేక గ్రంథాలలో కూడ కిడాంబి యాచ్చాన్ గురించి ఎన్నో వృత్తాంతాలు ఉన్నాయి. వాటిని సమన్వయీకరించి విశ్లేషకులు కిడాంబి యాచ్చియాన్ జీవితంలోని సన్నివేశాలలో వారు చూపిన ఆచార్య భక్తిని, త్రికరణ శుద్ధి గల మనస్తత్వాన్ని, దయా గుణానికి దర్పణం పట్టే వారి ధార్మిక వర్తనమును గొప్పగా అభివర్ణిస్తారు.

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

శ్రీమతి తిరుమల నీరజ



(క్రిందటి సంచిక తరువాయి)

**సనత్సుజాతీయం**

"మానవునికి తల్లిదండ్రులిచ్చిన శరీరం శరీరం కాదు, గురువు దయతో ఒసగిన తనువే తనువు. అదే పరమార్థ భూతం, అమృతం. గురువు శిష్యునికి తత్త్వాన్ని తెలిపి తీర్చి దిద్దిన దేహమే దేహం.

గురు బోధను అనుసరించి విద్యాభ్యాసానికి తొలి పాదం బ్రహ్మచర్యం. గురువు పట్ల ఉన్నట్లు గానే గురుపత్ని, గురు పుత్రుల సేవ రెండవ పాదం. గురువు కృప చేతనే తాను జ్ఞాని కాగలిగానని సంతోషించి గురువును మరింతగా పూజించడం మూడవ పాదం. ధనం, మనస్సు, ప్రాణం వీటిలో ఏదైనా సరే, దాచకుండా ఇచ్చి, త్రికరణశుద్ధిగా గురు సంప్రీతి కలిగించడం నాలుగవ పాదం. బుద్ధి పరిపాకంతో కొంత, బుద్ధి వైభవంతో కొంత, ఆచార్యుల వల్ల కొంత, సహపాఠితో విచారంతో చర్చ కొంత విద్య నేర్చుకొని, పన్నెండు విధాలైన జ్ఞానాన్ని, ఆరు విధాలైన త్యాగాన్ని, ఎనిమిది విధాలైన అప్రమాద సమర్థతను పొందాలి.

ఆచార్యయోగంతో బ్రహ్మచర్యాన్ని ఫలింప జేసుకోవాలి. అజ్ఞాని కర్మలు చేసి నశ్యలోకాన్ని నశించే భూలోకాన్ని, జ్ఞాని బ్రహ్మచర్య జ్ఞానాలతో శాశ్వత బ్రహ్మమును పొందుతారు.

ఈ ప్రకారం బోధించిన సనత్సుజాత మహర్షితో, ధృతరాష్ట్రుడు, "భగవన్! జ్ఞాని బ్రహ్మమును ఎక్కడ కనుగొంటాడు? దాని రూపం ఏ విధంగా ఉంటుంది?" అని ప్రశ్నించాడు."బ్రహ్మము అనేది రూపరహితం రూపం లేనిది. ఆతనికి పంచభూతాలతో కూడిన జన్మ ఉండదు. ఆతడు ఋగ్యజుస్సామాదులకు దొరకడు. జ్ఞానానికే లభిస్తాడు. అజ్ఞానులకు దూరంగా ఉంటూ అన్నిటా పరిభ్రమిస్తూ ఉంటాడు. అణువులలో అణువు. బ్రహ్మాండాల కన్నా పెద్ద. కేవలుడు, ప్రళయకాలంలో వెలుగొందుతాడు. ఆతని ప్రకాశంలోనే సర్వమూ నిలచి వెలుగొందుతుంది. జ్ఞానయోగంలో కోవిదుడైన ఆత్మవిదుడు ఆతనిని ఎరుగ గలుగుతాడు. ఆతనియందే జగాలన్నీ నిలబడుతాయి. ఇది ఎరిగిన వారే ముక్తులు.

"ఆకాశంలో ఒక దేవుడు, తనువులో ఒక దేవుడు ఇద్దరు ప్రకాశిస్తుంటారు. అన్ని దిక్కులూ వారి వల్లనే వెలుగుతాయి. అంతరాత్ముడైన పురుషుడు అంగుష్ఠమాత్రుడై బొటనవేలి ప్రమాణంలో లింగశరీరంలో ఉంటాడు. అజ్ఞాను లీతనిని కాంచలేరు. బ్రహ్మవిద్యలో నిష్ణాతుడైన మానవుడు ప్రజ్ఞానరూపుడై లోపల కల పరమాత్మను తెలుసుకొంటే, ఆతడు బొందిని – శరీరం వీడి పోనే పోడు! వానికి మరణమే లేదు. అతనికి బ్రహ్మముతోనే లంకె. సర్వభూతాల లోనూ విలసిల్లే ఈ పరమాత్మను చూడగలిగిన పిమ్మట, దేహ ఇంద్రియాదులను గురించి చింతించే పనే ఉండదు. నేను అంటే ఆత్మ, తల్లి అంటే ఆత్మ, తండ్రి అంటే ఆత్మ, పుత్రుడంటే ఆత్మ, సమస్తమూ ఆత్మే. ఉన్నదీ, లేనిదీ అంతా ఆత్మే. ఆ ఆత్ముడు ఒక్కడు, అసంగుడు. అందుచేత, నేను, మీరు, నీవు, వారు, అనేవన్నీ పచ్చి అబద్ధాలు! నేను మీకు కాను, మీరు నాకు కారు. ఎవరికీ ఎవరూ కారు. సర్వమూ ఆత్మమయం. ఆత్మ నుండే ఆత్మ పుట్టింది. ఆత్మకు ఆత్మే ఉనికి పట్టు. పడుగు పేకల వలె ఉన్న లోక మంతటా నిండి ఉన్నది ఆ ఆత్మే. నేనే ఆత్మను, నాకు జననమరణాలు లేవు" అని బోధించి, సనత్సుజాత మహర్షి క్షణంలో అదృశ్యుడై, నిజస్థానానికి వెళ్లిపోయాడు.


ఈ సనక సనందన సనాతన సనత్సుజాతులే శ్రీవైకుంఠ ద్వారపాలకులైన జయుడు, విజయుడు అనేవారు, తమను లోనికి పోనీయకుండా ఆటంకపరిస్తే, వారిని భూలోకంలో పుట్టమని శపించారు. ఆ కారణం చేతనే, మనకు శ్రీవరాహ నృసింహ, శ్రీరామ, శ్రీకృష్ణావతారాల గాథలు లభించాయి. భక్తపరాధీనుడైన పరమాత్మ, ఆయా అవతారాలలో ఆయా రాక్షసులను సంహరించి ముక్తి నిచ్చి, మళ్లీ తన ద్వారపాలనకు నియోగించు కున్నాడు.

(సనకసనందనాదుల వృత్తాంతం సమాప్తం)

★

# ప్రయత్నం - ప్రార్థన

శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు



ప్రతి మనిషికి ఒక లక్ష్యం ఉంటుంది. ఏ లక్ష్యం లేని వాడు మనిషేకాడు. లక్ష్యం లేని జీవితం దిక్సూచి లేని సముద్ర ప్రయాణం లాంటిది. కొందరికి శాస్త్రవేత్త అవ్వాలని, కొందరికి తత్త్వవేత్త అవ్వాలని, కొందరికి వేదవేత్త అవ్వాలని లక్ష్యం. మరికొందరికి ఐ.ఏ.యస్ అవ్వాలని, ఐ.పి.యస్ అవ్వాలని, సి.ఏ అవ్వాలని లక్ష్యం. వారి వారి అనుకూలతని బట్టి ఒకొక్కరు ఒకొక్క రంగంలో నిష్ణాతులుగా మారాలని కోరుకుంటారు. కోరుకున్న ప్రతి వ్యక్తి లక్ష్యాన్ని సాధించలేడు. కేవలం కోరిక ఉంటే సరిపోదు. అనుకున్న లక్ష్యం కోసం నిరంతర ప్రయత్నం చేసే తీరిక కూడా కావాలి. నేను ఇలా అవుతాను, అలా అవుతాను అంటూ మాటల్లో చిత్రాలను చూపించిన వారు, దాన్ని చేతల్లో చూపకపోవడం విచిత్రంగా అనిపిస్తుంది. తమోగుణం ఉన్నవారు నిద్రా, నీరసం నిర్లక్ష్యంతో ఏ ప్రయత్నము చేయరు. రజోగుణం ఉన్నవారు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటి దుర్గుణాల వల్ల అనుకున్న లక్ష్యాన్ని పరిపూర్ణంగా చేరుకోలేరు.



**క్రియా సిద్ధిః సత్వే భవతి** అన్నట్టు సత్వగుణం ఉన్నవారు ఆనందంతో, ఉత్సాహంతో, వివేకంతో, విచక్షణతో నిరంతర సాధనతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. మొత్తానికి సత్త్వగుణంతో ప్రయత్నం చేసే వారు అనుకున్న లక్ష్యాన్ని పొందుతారు అని తేలింది. ఇది బాగానే ఉంది కాని, చిన్న సందేహం తలెత్తుతుంది. సత్వగుణ సంపన్నుడై ప్రయత్నం చేస్తే మాత్రం ఆటంకాలు రావా? సమస్యలు ఉండవా? తప్పకుండా వస్తాయి. పరీక్షలకోసం తయారయిన వాడికే అసలైన పరీక్ష ఉంటుంది. మరి సత్వగుణంతో ఉన్నవారు సమస్యలను దాటడానికి, లక్ష్యాన్ని చేరుకోడానికి తమ ప్రయత్నానికి ప్రార్థనను తోడు చేసుకుంటారు. "ప్రయత్నం బంగారమైతే ప్రార్థన అగ్ని వంటిది". అగ్నిలో సంస్కరింపబడిన బంగారం పూర్వపు కాంతికంటే రెట్టింపుకాంతితో మెరిసినట్టు. ప్రార్థనని తోడు చేసుకున్న ప్రయత్నం కూడా ఫలవంతమవుతుంది. తనని తాను రక్షించుకునే ప్రయత్నం విఫలమైనప్పుడు. గజేంద్రుడు పరమాత్మని ప్రార్థన చేసాడు. ఆ ప్రార్థన ఆలకించిన శ్రీహరి మకరిని సంహరించి కరిని రక్షించాడు. ప్రతీ ఒకరిలో కరి వంటి బలం ఉన్నా, మకరి లాంటి సమస్యలు కూడా ఉంటాయి. "సమస్యలనే మకరాలను సంహరించి, సమున్నత శిఖరాలను అధిరోహించాలంటే." మానవ ప్రయత్నానికి మాధవుని ప్రార్థనని జత చేయాలి. అప్పుడే జీవుని కృషికి దేవుని కృప తోడవుతుంది. మనకి చల్లని నీడవుతుంది. జీవితంలో ఎదురయ్యే ఎంత పెద్ద సమస్యనైనా ఓడించాలన్నా, ఈ ప్రపంచాన్ని మన ప్రతిభతో ఆడించాలన్నా, పరమాత్మకి చేతులు జోడించాలన్నది పెద్దల మాట.

**వివేకంతో చేతులు ఆడించుట ప్రయత్నమైతే**
**వినయంతో చేతులు జోడించుట ప్రార్థన అవుతుంది**

# సూర్యోపాసన - ఆరోగ్యం



**శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు**

## ఆరోగ్యం భాస్కరాత్ ఇచ్ఛేత్

కాల స్వరూపుడైన శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు తన అనుగ్రహాన్ని మనమీద వర్షించడానికి ఈ పవిత్ర 'మా అఘ' మాఘ మాసము మనకు పవిత్ర వైదిక క్రియల ద్వారా చక్కని సాధనంగా చెప్పవచ్చు. లోకంలో భగవంతుడు మనుష్యులకు సమృద్ధిగా అనుగ్రహించినా వాటికి అన్నింటికీ ముఖ్యమైన వేద విజ్ఞానాన్ని పరమ కృపతో అనుగ్రహించాడు కదా! కానీ మన ఆ జీవన ధ్యేయం తెలియక సంసారంలో తిరుగుతూ ఉన్నాము. కానీ పెద్దలు ఋషులు తమ దివ్య దృష్టితో మంచి కోరి చాలా బోధనలు చేశారు. మన ఉత్తమ గతి ప్రాప్తికై శృతి మాత కూడా మన జీవన ధ్యేయాన్ని తెలుపుతూ **"శతాయుర్వైపురుషః శత వీర్య ఆయు రవరంధ్రే"** అని పరిపూర్ణమైన ఆయుష్షుతో మంచి సాధన చేస్తూ జీవించాలని ఆశీర్వదించింది. మన ఆయుష్షు కూడా దానికోసం వెచ్చించాలి అని వేదం మరొకచోట

**ఆయుర్యజ్ఞాయదత్తం ఆయుర్యజ్ఞపతయే దత్తం**
**శ్రోత్రం యజ్ఞాయ దత్తం వాగ్యజ్ఞాయ దత్తం**
**చక్షుర్యజ్ఞపతయే దత్తం ఇతి** అని మన పూర్ణ ఆయుష్షు కూడా యజ్ఞ నిర్వహణకై, యజ్ఞమయమైన భగవంతుని కైంకర్యం కొరకు వినియోగించటానికి మన సర్వేంద్రియ ములు కూడా ఉన్నాయి అని వేదం చెప్తుంది. ఇటువంటి కార్యములకు ముఖ్యంగా మాఘ మాసము చక్కగా అన్వయిస్తుంది.

మనలో ఉన్న పాపాలని, రోగాలను కూడా తొలగించి తద్వారా ఆయుష్షును మరియు ఉత్తమ ఫలితాలను అందిస్తుంది. పై రెంటికి కూడా శరీరం ఒక సాధనం దీనిని కాపాడుకోవడం మన బాధ్యత **"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం"** అంటారు. ఈ శరీరం కూడా మన పాప కర్మలపై ఆధారపడి ఉంటుంది. **"జన్మాంతర కృతం పాపం వ్యాధి రూపేన పీడ్యతే"** అని అంటారు. ఇలాంటి పాపాన్ని తొలగించి ఆరోగ్యాన్ని ప్రసాదించే పరమ పావన మాసం ఈ "మా అఘ" మాఘ మాసం.

ఈ మాసం సూర్యోపాసన చాలా ముఖ్యమైనది. పురాణాల్లో ఇతిహాసాల్లో చెప్పిన వైదిక ప్రక్రియలలో, పరమ ప్రామాణ్యం గా మరియు కృష్ణ యజుర్వేద బ్రాహ్మణంలో విశేషంగా సూర్యోపాసన మహాత్మ్యాన్ని వివరిస్తుంది. సంపదలు కీర్తి విద్య భోగభాగ్యాలు అన్నీ ఆయా ఆయా దేవతలు అనుగ్రహించినా వాటిని అన్నింటిని, అన్నింటితో పాటు వాటికి మూలం అయిన జగత్కర్త, జగత్ భర్త సూర్యనారాయణుడు. మనకు "ఆరోగ్యం భాస్కరాత్ ఇచ్ఛేత్" అని సూర్యుడు ఆరోగ్యం ప్రసాదిస్తాడు అని చెప్పబడింది.

విశేషించి యజుర్వేదాంతర్గతమైన "అరుణ ప్రశ్న" శాస్త్ర రీతిన విశేషంగా పారాయణం చేసినా, దానిని జపించినా తీర్థాన్ని స్వీకరించినా, విన్నా అపరిమిత ఫలితాన్ని మనకు అందిస్తుంది. అలానే ఈ మాసంలో సూర్యోదయాత్ పూర్వం నదీ, సముద్ర స్నానం అమిత ఫలితాన్ని అందిస్తుంది.

**దుఃఖ దారిద్ర్య నాశాయ శ్రీవిష్ణోః తోషణాయ చ**
**ప్రాతస్నానం కరోమ్యద్య మాఘే పాప వినాశనం**
**మకరస్థే రవౌ మాఘే గోవిందాచ్యుత మాధవ**
**స్నానేనానేన మే దేవ యథోక్త ఫలదో భవ** అని తెలుపుతుంది. అనగా దుఃఖాన్ని తొలగించుకోవడం కోసం, దారిద్ర్య నాశనం కోసం, శ్రీ విష్ణువుకు ఆనందాన్ని కలిగింప చేయడం కోసం సూర్యోదయాత్ పూర్వం మాఘ మాసంలో పాప వినాశనం కోసం రవి మకరంలో ఉన్నప్పుడు గోవిందా అచ్యుత మాధవ అనే నామాలను నోటితో ఉచ్చరిస్తూ స్నానం చేసినట్లయితే శాస్త్రోక్తమైన సత్ఫలితాలు కలుగుతాయి.

యజుర్వేదంలోని అరుణ ప్రశ్నలో సూర్య మహిమ తెలుసుకునే ప్రయత్నం కొద్దిగా చేద్దాం! రెండవ అనువాకంలో **"స్మృతిః ప్రత్యక్ష మైతిహ్యం"** అంటూ సూర్య మధ్య వర్తి అయిన శ్రీమన్నారాయణుడు ఆకాశంలో పై భాగంలో ఉంటూ సమస్త జీవరాశికి, 14 లోకాల్లో ఇలా వ్యాపించి ఉన్న అన్ని విధాల రోగాలను తొలగిస్తూ పోషణ చేస్తాడు అని తెలుపుతుంది.

**స్మృతిః ప్రత్యక్షమైతిహ్యం అనుమాన శ్చతుష్టయం।**
**ఏతై రాదిత్య మండలం సర్వైరేవ విధాస్యతి॥**

1) స్మృతి అనగా ధర్మశాస్త్రాలలో (మన్వాది)

2) ప్రత్యక్షం అనగా ప్రత్యక్ష జ్ఞానేంద్రియ గోచరములచేత

3) ఐతిహ్యం అనగా శ్రీరామాయణ భారతాదుల చేత


4) అనుమానః అనగా హేతుదృష్టాంతముల చేత కూడిన శిష్టాచార రూపములైన అనుమానము చేత, చతుష్టయః ఈ నాలుగు ప్రమాణాలు, ఈ సమస్త ప్రమాణముల చేత, ఆదిత్య మండలం సూర్య మండలం, విధాస్యతే నిశ్చయింపబడినది. అనగా సూర్య మండలం జగత్తుకు అన్నివిధాలా శ్రేయస్సును కల్గిస్తుందని అన్ని ప్రమాణములతో నిర్ధారింపబడినదికదా! సూర్యుని పై భాగమున తన కిరణాల చేత సర్వత్ర వ్యాపించి ఆయా మాస ఋతు పక్ష దిన మొదలగు కాల భేదములచేత బీజ ఉత్పత్తి, పుష్పవృద్ధి కేవలము సూర్యకిరణ పరిపాకము వలననే అని తెలియుచున్నది.

ముఖ్యమైనది ఆరోగ్యవర్ధనము కదా! ఈనాటి కొత్త రోగాలను సైతం తొలగించే ప్రభావం సూర్య ఉపాసన మరియు సూర్య భగవానుని అనుగ్రహంతో తొలగించుకోవచ్చు **"ఓం అక్షీభ్యాం తే నాసికాభ్యాం"** అనే మంత్రంలో సూర్యనారాయణ ఉపాసన ద్వారా కేవల కిరణ స్పర్శ వృద్ధితోనే నేత్రముల యందు నాసిక చెవి చెంపలు గడ్డం యందు శిరస్సు కపాల నాలుక యందు మరియు సర్వేంద్రియముల యందు వచ్చు (క్యాన్సర్) క్షయ వంటి రోగాలను కూడా తొలగించే శక్తి ఉందని తెలుస్తుంది. కేవలం ఇంతే కాక రోమవ్యాపక, మలమూత్ర గర్భవ్యాపకాది రోగాలను సైతం సూర్య శక్తి నయం చేయగలదు. చివరకు సముద్రంలో పాతాళం వరకు ఉండే క్రిమికీటకాలకు సైతం ఆహారాన్ని అందిస్తూ, ఆరోగ్యాన్ని ప్రసాదించి సకల జీవశక్తిని ప్రసాదించేవాడు సూర్యనారాయణుడు. ఇలా ఈ పవిత్ర మాసంలో పాప క్షయాన్ని స్నానంతో, సూర్యోపాసన ద్వారా మరియు శ్రీమన్నారాయణుని అనుగ్రహంతో పోగొట్టుకొని ఆరోగ్య సంపదను ఆచార్య అనుగ్రహంతో పొందాలని కోరుకుందాము.

# పుస్తక పరిచయం

## "శ్రీమద్రామాయణ సుధాస్వాదము"

"ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం" అని శ్రీరామ చరిత్ర చదివితేనే సకల దోషాలు హరిస్తా యనేది ఆర్యోక్తి. భారతదేశ గాలిలో నీటిలో మట్టిలో రామకథ సమ్మిళితమై ఉంటుంది. ఆబాలగోపాలం అందరికీ ఆ కథ ఎక్కడ విన్నాము చదివామో తెలియకుండానే హృదయపు లోతుల్లోంచి రామకథ ధ్వనిస్తూనే ఉంటుంది. "శ్రీమద్రామాయణ సుధాస్వాదము" అనుగ్రంథము రామాయణ కథలోని రస మాధుర్యాన్ని, వేదోక్తమైన సంప్రదాయ ప్రస్తుతిని, లౌకికాముష్మిక ఫల ప్రాప్తిని సమ్మిళితం చేసి





సాగిన సుధావాహిని. ఈ గ్రంథాన్ని మధురవాక్ శిఖామణి, ఉపన్యాస దివాకర బిరుదాంకితులు ప్రముఖ సంప్రదాయ ప్రవచనకారులు శ్రీమాన్ సాతులూరి గోపాలకృష్ణమాచార్య రచించగా శ్రీవెంకటాచార్య వైదిక సంస్థాన్ ఎస్సార్ పురంనుండి వెలువడినది

గ్రంథమంతా సులభ ప్రసంగ భాషలో చదువరులను ఆకర్షించే విధంగా ఉంటుంది. బాలకాండ నుండి యుద్ధకాండ వరకు కథా మాధుర్యాన్ని సోదాహరణంగా వివరిస్తూ సంప్రదాయ అంశాలతో సమన్వయం చేశారు. 250 పేజీలతో చక్కని ముఖచిత్రంతో, ప్రత్యేకించి ప్రారంభ పేజీలలో ముందుమాటలు ఫలకామనల కొరకు రామాయణంలో పఠించాల్సిన శ్లోకాలు, ఘట్టాలు, ఫలితాల వివరాలను పట్టికగా ఇచ్చారు. శ్రీరామాయణంలోని కాల నిర్ణయాన్ని వివరించారు. పారాయణా విధి విధానాలు వివరిస్తూ సంక్షేపరామాయణ మూల శ్లోకాలను ముద్రించారు. రామాయణ నిర్వచనాలతో వాల్మీకి వైభవంతో గ్రంథం ప్రారంభమై సాగుతుంది. ప్రత్యేక వివరణలు కలిగి ప్రవచన కారులకు మార్గదర్శనంగా, అన్ని రకాల పాఠకులను అలరిస్తుంది. వెల ఇవ్వబడలేదు. లభించు ఫోన్ నెంబర్ 9949905123 శ్రీ వెంకటాచార్య 'వైదికసంస్థాన్' విశాఖపట్నం.

# మాఘ మాస మహిమ

ప్రత్యేకం

మాఘ మాసము మిక్కిలి పుణ్యప్రదమైన మాసము. ఈ మాసమున సముద్ర నద్యాది స్నానములు ప్రధానమైనవి. రథసప్తమి, శ్రీ పంచమి, భీష్మాష్టమి, భీష్మ ఏకాదశి, శివరాత్రి వంటి పర్వదినములతో అలరారే మాసమిది. "మఖ నక్షత్రంతో కూడిన పూర్ణిమగల మాసము కావున ఈ మాసమునకు మాఘ మాసమని పేరు ఏర్పడింది. ఈ మాసము మూడు విధములుగా ఉండే అవకాశం ఉంది. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించునప్పుడు శుద్ధ పాడ్యమి మొదలు అమావాస్య వరకూ ఉన్న మాఘ మాసమునకు 'ముఖ్య చాంద్ర' మని పేరు. కృష్ణ పాడ్యమి నుండి పూర్ణిమ వరకూ ఉన్నచో 'గౌణ చాంద్ర' మని పేరు. మకరరాశిలో రవి కలిగి ఉంటే దానికి "సౌర' మని పేరు.

ఈ మాఘ మాసంలో చేయవలసిన పుణ్య కర్మల గురించి పాద్మ పురాణం

**స్వర్గ లోకే చిరం వాసో యేషాం మనసి వర్తతే।**
**యత్ర క్వాపి జలే తైస్తు స్నాతవ్యం మృగ భాస్కరే॥**

"స్వర్గ లోకంలో చాలా కాలం నివసించాలని భావించే వారు, మకర రాశిలో సూర్యుడు గల మాఘ మాస మందు సముద్ర మందో, పుణ్యనది యందో తీర్థములందో ఎక్కడ పవిత్ర జలము కలదో అక్కడ సంకల్ప పూర్వక స్నానము చేయవలెను" అని మాఘ స్నానమును విధించింది.

అరుణోదయ కాలంలో పుణ్యజలమున మునిగి, ఆచమనము చేసి, ఉత్తరాభిముఖుడై "ఓమ్ తత్ సత్' అని ఉచ్చరించి, పూలు, దర్భ, నువ్వులు, జలమును చేతియందుంచుకొని,

**ఓ మద్య మాఘే మాసి అముక పక్షే అముక తిథా వారభ్య**
**మకరస్థ రవిం యావత్ ప్రత్యహ మముక గోత్రో అముక దేవ**
**శర్మా స్వర్గలోకే చిరకాల వాసకామో విష్ణు ప్రతి కామో వా**
**ప్రాతః స్నాన మహం కరిష్యే** అని సంకల్పించి, గంగా వ్యతిరిక్తమైన సామాన్య జలమందైనను స్నానము చేయవలెను. సూర్యుడు మకరరాశిలో కాక 'కుంభము' నందు ప్రవేశించినచో సంకల్ప మందు కొంత మార్పు చేయవలెను. స్నానము చేసేటప్పుడు.

**ఓం దుఃఖ దారిద్ర్య నాశాయ శ్రీ విష్ణో స్తోషణాయచ**
**ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాప ప్రణాశనమ్**
**మకరస్థే రవే మాఘే గోవిందాచ్యుత మాధవ**
**స్నానేనానేన మే దేవ యథోక్త ఫలదో భవ**

"దుఃఖ దరిద్రము నశించుటకు శ్రీవిష్ణువును సంతోషింప చేయుటకు మాఘ మాస మందు పాపములు నశించుటకై ఈరోజు ప్రాతః స్నానమును చేయుచున్నాను. మకర రాశిలో సూర్యుడు గల మాఘ మాసమందు చేయు ఈస్నానము ద్వారా ఓ గోవింద! అచ్యుత! మాధవా! దేవా! శాస్త్రమందు ఏఫలము చెప్పబడినదో ఆ ఫలమును ప్రసాదించుము." అని ప్రార్థిస్తూ చేయవలెను.



**వాసుదేవం హరిం కృష్ణం**
**శ్రీధరం చ స్మరేత్తతః**

ఆ తర్వాత వాసుదేవ, హరి, కృష్ణ, శ్రీధర నామస్మరణ చేయవలెను.

**ఓం దివాకర జగన్నాథ ప్రభాకర నమోస్తుతే।**
**పరిపూర్ణం కురుష్వేదం మాఘస్నానం మహావ్రతమ్॥**

అంటూ సూర్యుని ప్రార్థించవలెను.

మకరరాశిలో సూర్యుడు లేనిచో అనగా చాంద్రస్నానమందు 'మకరస్థేరవౌ' అని చెప్పనవసరం లేదు. అప్పుడు సామాన్యముగా

**మాఘ మాస మిమం పుణ్యం స్నామ్యహం దేవ మాధవ।**
**తీర్థ స్యాస్య జలే నిత్యం ప్రసీద భగవన్ హరే॥**

"ఓ మాధవ! పుణ్యప్రదమైన ఈ మాఘ మాసమున ఈ తీర్థమున స్నానము చేయుచున్నాను. ఈ జలమందు ప్రసన్నుడవై అనుగ్రహించుము". అని పఠించి, 'దుఃఖ దారిద్ర్య నాశాయ' అని పఠించి స్నానము చేయివలెను. మాఘ మాసంలో గంగా స్నానము గొప్ప ఫలమును ప్రసాదిస్తుంది.

**దినే దినే సహస్రన్తు సువర్ణానాం విశాం పతే।**
**తేన దత్తం హి గంగాయాం యో మాఘే స్నాతి మాధవ॥**

"ఎవరైతే మాఘమాసంలో గంగా స్నానం చేస్తాడో అతడు ప్రతిరోజూ వెయ్యి బంగారు నాణెములను దానం చేసిన పుణ్య ఫలాన్ని పొందుతాడు." అని పద్మ పురాణము చెబుతున్నది.

మాఘ శుద్ధ పంచమిని 'శ్రీపంచమి' అంటారు. ఈనాడు లక్ష్మీ, సరస్వతులను పూజించాలని శాస్త్రం పేర్కొంటున్నది.

లక్ష్మీ ప్రీతి కాముడు 'లక్ష్మీ పూజన మహం కరిష్యే!' అని సంకల్పించి, సాలగ్రామ మందు కానీ జలకుంభమందు అమ్మవారిని అవాహన చేసి కానీ పూజించాలి.

**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

**పాశాక్ష మాలికాంభోజ శృణిభి ర్యామ్య సౌమ్యయోః**
**పద్మాసనస్థాం ధ్యాయేచ్చ శ్రియం త్రైలోక్య మాతరమ్।**
**గౌరవర్ణాం సురూపాంచ సర్వాలంకార భూషితామ్**
**లౌక్మ పద్మ వ్యగ్ర కరాం వరదాం దక్షిణేన తు॥**

"పాశము, తామర పూసలమాల, పద్మము అంకుశములను కుడి ఎడమ చేతులలో ధరించి పద్మాసనము నందు కూర్చొని గౌరవర్ణము కలదై సర్వాలంకారములను ధరించినదై బంగారు పద్మములను ధరించినదై, వరదాభయ ముద్రలను ధరించినదైన త్రిలోక మాతయగు శ్రీమహాలక్ష్మిని ధ్యానించ వలెను. "శ్రీలక్ష్మ్యైనమః" అంటూ నైవేద్యాన్తముగా పూజించవలెను.

**నమస్తే సర్వదేవానాం వరదాసి హరిప్రియే**
**యా గతిస్త్వత్ప్రపన్నానాం సామే భూయాత్త్వ దర్చనాత్**

అంటూ మూడు మార్లు పుష్పాంజలిని సమర్పించి ప్రణామము చేయవలెను, అలాగే సరస్వతీ ప్రీతి కాముడైన వాడు సరస్వతీ పూజనము చేయవలెను. సరస్వతిని కూడా సాలగ్రామ మందు కానీ పూర్ణజల కుంభమందు కానీ పూజించవలెను.

**తరుణ శకల మిందోః బిభ్రతీ శుభ్ర కాన్తిః**
**కుచభర నమితాంగీ సన్నిషణ్ణా సితాబ్జే**
**నిజకర కమలోద్య ల్లేఖనీ పుస్తక శ్రీః**
**సకల విభవ సిద్ధ్యై పాతు వాగ్దేవతా నః**

"అర్ధచంద్రుని సిగలో ధరించినదై, తెల్లని దేహకాన్తి కలదై, స్తనభారముచే కొంచెము వంగినదై, తెల్లని పద్మమున కూర్చున్నదై, తన కరకమలములలో లేఖనిని పుస్తకమును ధరించిన వాగ్దేవేతయగు సరస్వతిని సకల విభవ సిద్ధి కొరకు రక్షణ కొరకు ధ్యానించి "ఓం సరస్వత్యై నమః" ఇత్యాదిగా నైవేద్యాన్తము పూజించి,

**యథా న దేవో భగవాన్ బ్రహ్మా లోక పితామహః**
**త్వాం పరిత్యజ్య సన్తిష్ఠేత్తథా భవ వరప్రదా**
**వేదాః శాస్త్రాణి విజ్ఞానం నృత్య గీతాదికం చ యత్**
**న విహీనం త్వయా దేవి తథా మే సన్తు సిద్ధయః**
**లక్ష్మీ ర్మేధా ధరా పుష్టిః గౌరీ తుష్టిః ప్రభాధృతిః**
**ఏతాభిః పాహి తనుభిః అష్టాభి ర్మాం సరస్వతి**

"ఓ సరస్వతి! నిన్ను విడచి లోక పితామహుడు దేవశ్రేష్ఠుడైన బ్రహ్మదేవుడు ఉండడో అదే విధముగా నా విషయమున నీవు వరప్రదురాలవగుము. నీ అనుగ్రహము లేక వేదశాస్త్ర విజ్ఞాన నృత్య గీతాదులు లభించవు. ఈ సిద్ధులన్నీ నీ అనుగ్రహముచే నాకు లభించుగాక. లక్ష్మీ, మేధా, ధరా, పుష్టి, గౌరీ, తుష్టి, ప్రభా ధృతి అనే ఎనిమిది రూపములచే నన్ను రక్షించుము అని ప్రార్థించి ప్రణామము చేయవలెను. పుస్తకమును, లేఖనిని (కలము) పూజించవలెను. ఈ విధముగా మాఘ మాస పంచమినాడు లక్ష్మీ, సరస్వతులను పూజించవలెను.

మాఘసప్తమినాడు సూర్యారాధన చేయవలెను. దీనినే 'రథసప్తమి' అని అంటారు. ఈనాడు చేయు సంకల్ప పూర్వక తీర్థస్నానము, సూర్యగ్రహణ కాలీన గంగా స్నాన జన్య ఫల సమమగును. స్నానము చేయునపుడు ఏడు రేగు ఆకులను, ఏడు జిల్లేడు ఆకులను శిరస్సున ఉంచుకొని

**యద్యజ్జన్మ కృతం పాపం మయా సప్తసు జన్మసు**
**తన్మే రోగం చ శోకం చ మాకరీ హన్తు సప్తమీ** అని ఉచ్చరించి స్నానము చేయవలెను. అనంతరం ఏడు రేగు ఆకులు, ఏడు జిల్లేడు ఆకులు, శాలి తండులము, నువ్వులు, గరిక, అక్షతలు, చందనము కలిపిన నీటిని తీసుకొని సంకల్పము చెప్పిన తర్వాత

**నమో వివస్వతే బ్రహ్మన్ భాస్వతే విష్ణు తేజసే**
**జగత్సవిత్రే శుచయే సవిత్రే కర్మదాయినే**
**జననీ సర్వభూతానాం సప్తమీ సప్తసప్తికే**
**సప్త వ్యాహృతికే దేవి నమస్తే రవి మండలే** అని పఠించి,
'ఇద మర్ఘ్యం సూర్యాయ నమః' అని అర్ఘ్యమిచ్చి,
**సప్తసప్తి వహప్రీత సప్తలోక ప్రదీపన**
**సప్తమ్యాం హి నమస్తుభ్యం నమో2నంతాయ వేధసే** అని ప్రణామము చేయవలెను. "నమస్కార ప్రియో భానుః' అంటారు. కావున సూర్యునకు చేయు నమస్కారము అత్యంత ఫలదాయకమైనది.

"భీష్మాష్టమి' పితృప్రీతి కరమైనది. భీష్మునకు తర్పణము చేయవలెను.


**వైయాఘ్రపద్య గోత్రాయ సాంకృతి ప్రవరాయ చ।**
**అపుత్రాయ దదామ్యేతత్ సలిలం భీష్మ వర్మణే॥** అని తండ్రికి తర్పణము చేయురీతిలో తర్పణము చేయవలెను. ఆ తర్వాత నమస్కరిస్తూ

**భీష్మః శాన్తనవో వీరః సత్యవాదీ జితేన్ద్రియః**
**ఆభిరద్భి రవాప్నోతు పుత్ర పౌత్రోచితాం క్రియామ్**
అంటూ ప్రార్థించాలి.

'భీష్మఏకాదశి' ని విష్ణు సహస్రనామ జయన్తిగా సంభావించుట కలదు. కావున ఆనాడు ఉపవాసము, విష్ణు సహస్రనామ పారాయణ, జప, అర్చనాదుల ద్వారా కాలమును గడిపి, ద్వాదశినాడు తిలోద్వర్తనము, స్నాన, తర్పణ, మహాదాన, భోజనాది క్రియలను ఆచరించవలెను.

ఇక మాఘ పూర్ణిమకే 'మహామాఘి' అనిపేరు. దీనిని యుగాదిగా కూడా సంభావిస్తారు. కావున పార్వణ విధానముగా శ్రాద్ధం చేయవలెనని శాస్త్రం చెపుతున్నది. ఈనాడు చేయు సముద్ర, పుణ్య నదీస్నానాలు అత్యంత ఫల దాయకములు, విష్ణుప్రీతికరములు. ఈ మాసమందే మహాకుంభమేళా వంటివి ఆచరించడం జరుగుతున్నది. కాశీ ప్రయాగాది పుణ్య తీర్థములందు ఈ మాసమున "స్నాన, దాన, తర్పణాదులను ఆచరించుట అత్యంత పుణ్యప్రదము. ★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

అలంకార వాస్తులో ప్రధానంగా మొక్కల యొక్క ప్రాశస్త్యం, వృక్షాల యొక్క గొప్పతనాన్ని గురించి తెలుసుకొంటున్నాము. ఇంట్లో పరిస్థితి అవకాశం ఉన్నా లేకున్నా తులసి మొక్కను పెట్టుకోలేనంత చిన్న ఇల్లు అయితే ఉండదు. కనుక ఆ తులసీ మొక్క యొక్క ప్రభావాన్ని, ప్రాశస్త్యాన్ని తెలుసు కొంటున్నాము.



వృక్షాలను, ప్రకృతి పర్యావరణాన్ని ఆదరించగలిగితే ప్రతి ప్రాణి సుఖముగా ఉంటుంది. ప్రతి ప్రాణి కూడా ప్రకృతి పర్యావరణ వ్యవస్థతోనే జీవన మనుగడ సాగిస్తుంది. లక్ష్మీ తులసి, కృష్ణ తులసీ అని రెండు తులసి చెట్లు అన్ని ప్రాంతాలలో అందుబాట్లలో ఉంటాయి. తులసిలో చాలా రకాలుగా ఉన్నాయని శాస్త్రాలలో చెప్పినా అందరికి అందుబాటులో వుండి ఆరాధించుకొనే మొక్క లక్ష్మి తులసి, కృష్ణ తులసి. ఏ పూజా పునస్కారాలు చేయడానికి అవకాశం లేకున్నా కనీసం తులసి వృక్షానికి ఒక నమస్కారం చెయ్యడం ద్వారా, దానికి ప్రదక్షిణం చెయ్యడం ద్వారా అద్భుతమైన ఫలితాలు మనకు ఇస్తాయని ప్రాచీనులు శాస్త్రాల ద్వారా తెలియజేసారు.

దానిలో విశేషించి తులసిని ఏయే నక్షత్రాలలో పెట్టినప్పుడు ఇంకా ప్రభావితమైనవై శక్తి కలిగినవై మనకు మానసిక, శారీరిక అనేక రుగ్మతలను దూరం చేస్తాయి. ప్రాచీనకాలంలో ఆయుర్వేద వైద్య నిపుణులు వైద్యం చేస్తే దీర్ఘకాలిక జ్వరాలు కానీ, జలుబులు కానీ ఎన్ని మందులు వాడిన తగ్గడం లేదు ఏంచెయ్యమంటారు అని అడిగితే,

తులసి తోటలో ఈ వ్యాధి గ్రస్తుడిని కూర్చోబెట్టండి. దాని గాలి వల్ల రుగ్మతలన్ని దూరమవుతాయి, ఆరోగ్యం కలుగుతుంది అని చెప్పేవారు. ఇంట్లో తులసి తోట విశాలమైన ఖాళీ స్థలాలతో ముందు పూర్వకాలం గృహాలలో ఉండేవి.

ఒక సమయాన్ని, స్థలాన్ని ఎంచుకొని చెట్టు నాటడం చేసినప్పుడు అపరిమితమైన శక్తి ఆ వృక్షానికి వస్తుంది. ఈ మొక్కలు ఎప్పుడు నాటాలి. అందులో కృష్ణ తులసిని ఏ రోజున, ఏ నక్షత్రంలో నాటాలి, లక్ష్మీ తులసిని ఏ నక్షత్రంలో ఏ రోజున నాటాలి అనే విషయాన్ని ఈ సంచిక ద్వారా తెలుసు కొంటున్నాము. పూర్వఫల్గుణి, ఉత్తరఫల్గుణి, స్వాతి, అనూరాధ, రేవతి నక్షత్రములలో లక్ష్మీ తులసిని తులసికోటలో నాటాలి. అందులో శుక్రవారం కలిసివస్తే ఇంకా విశేషము. అట్లాగే రోహిణి, శ్రవణం, హస్త రోజున బుధవారం కలిసివస్తే ఇంకా విశేషించి హరిత్రయములు అంటే దశమి, ఏకాదశి, ద్వాదశి ఈ మూడు తిథులలో కృష్ణ తులసిని తులసికోటలో లక్ష్మి తులసి ప్రక్కన నాటితే ఆ రెండు కూడా కలిపి అద్భుతమైన వాతావరణాన్ని అక్కడ పెంచుతాయని, తద్వారా మానసిక, శారీరిక వ్యాధులు దూరమవుతాయని, ఆయురారోగ్య భోగభాగ్యాలు కలుగుతాయని మనకు ఈ క్రింది శ్లోకం ద్వారా పెద్దలు అందించారు.

**రోహిణీశ్రవణహస్తాయామ్ సౌమ్యవారే హరిత్రయం**
**ఏతే శుభవేళాయాం హరితులసీ స్థాపనం శుభం**
**పూర్వోత్తరఫల్గుణ్యామ్ స్వాత్యనురాధరేవతీ**
**భృగువారే సంయుక్తం శ్రీతులసీ స్థాపయేత్ శుభం**

అని తులసీ వృక్షాన్ని నాటే విధానాన్ని ఆయా నక్షత్రాలను, ఆయా తిథులను సూచించడం జరిగింది. నిజంగా ఆ పద్ధతిలో మనం నాటుకో గలిగితే (మిగతా 27 వ పేజీలో)

# శ్రీహరి అతిమానుష చేష్టితాలు



**శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు**

శ్రీమన్నారాయణుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారాలలో అనేకమైన కళ్యాణ గుణాలను ప్రకాశింపచేసినాడు. ఏ అవతారము తీసుకున్నా అది ఒక ప్రత్యేకమైనదిగానే ఉంటుంది. అనేకమైన ఆయన కళ్యాణ గుణాలలో కొన్నింటిని మాత్రమే ప్రకాశింపచేస్తూ మనలను అనుగ్రహిస్తాడు స్వామి. ఇవన్నీ కూడా పరమాత్మ తనకు తానుగా, నేను దైవాన్ని అని ప్రకటిస్తూ లోకులను ఉద్ధరిస్తే, కొన్ని మాత్రము నేను సాధారణమైన మనిషిని అని తెలియచేస్తూ మనుషులకు సాధ్యం కాని తన కళ్యాణ గుణాలను ప్రకటిస్తూ ఉంటాడు. అందులో రామ, కృష్ణ అవతారాలలో అనేకమైన అతిమానుష చేష్టలు చేస్తూ కూడా తాను సాధారణమైన మనిషి అనుసరించే ధర్మాలను ఆచరించి చూపినాడు.

'సంభవామి ఆత్మమాయయా' అని తానే చెప్పినట్టుగా తన స్వభావాన్ని, తన దేహాన్ని విడిచి పెట్టకుండా భూమిపైన అవతరిస్తాడు (జన్మిస్తాడు), లోకంలో ఇప్పుడే తల్లి గర్భం నుండి పుట్టినట్టుగా సాధారణ పిల్లవాడుగా అవతరిస్తాడు.

శ్రీమన్నారాయణుడు శ్రీరాముడిగా అవతరించి కొన్ని ఆశ్చర్యకరమైన పనులను చేసినాడు. కాని ఆయన **ఆత్మానం మానుషం మన్యే రామం** నేను మనిషిని అని అనుకుంటున్నాను. దేవుడిని కాను అని పల్కినాడు. ఒక సాధారణమైన భర్త వలే సీతాదేవి అపహరించబడినపుడు, చెట్టును, పుట్టను, కొండను, కోనను ఆమె జాడ కోసం. ప్రాధేయపడినాడు. కాని జటాయువును కల్సిన తరువాత తన భార్యను కాపాడటానికి ప్రయత్నించి రావణుడి చేతిలో తన రెక్కలు నరకబడి కొన ప్రాణంతో ఉండి రెండు మూడు మాటలు మాత్రము చెప్పి ప్రాణం విడిచిన జటాయువుకు నీవు దహన సంస్కారం చేసావు.

**మయాత్వమ్ సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్!.** నాచేత ఆదేశింపబడిన వాడివై సాటిలేని మేటి లోకాలకు వెళ్ళిపో అని అన్నావు. నీవు శ్రీమన్నారాయణుడివి కాకుండా కేవలం మనుష్యుడివి అయితే ఇలా ఎలా అనగలవు. అన్ని లోకాలకు మిన్న అయిన, నాశనము, మార్పు చేర్పులు, ఎటువంటి వికారాలు లేని, దుఃఖ వాసనలు లేనటువంటి, ఎప్పుడూ ఆనంద సుఖభోగాలతో ఉండే పరమపదం చేరుకొమ్మన్న పరమపద నాథుడివి నీవే కాదా? నీది కాని దాని యందు నీకు హక్కు ఉండదు కదా? మరి నీవు నీ లోకంలో (నా ఆస్తి) కాని దాన్ని ఎలా అనుభవింప చేస్తావు. కాబట్టి రామా! నీవే ఆ శ్రీమన్నారాయణుడివి. ఇది నీ అతిమానుష చేష్టితము కాదా స్వామి! ఇదే విషయాన్ని నమ్మాళ్వార్లు వారి తిరువామ్‌మొజి (7–5–1) **కఱ్పార్ ఇరామ పిరానై మఱ్ఱుమ్ కఱ్పరో** అనే పాశురంలో అంటారు. శ్రీరామునికి తిరు అవతార దివ్య దేశమైన అయోధ్యానగరంలో ఉన్న సకల చరాచరము లన్నింటికిని పరమపదమును అనుగ్రహించెను అనే విషయాన్ని తెలిపినారు. శ్రీకృష్ణుడుగా స్వామి నీవు అవతరించిన వేళ తల్లిదండ్రుల సంకెళ్ళను క్షణకాలంలో తొలగించినావు, ఒక తల్లికి పుట్టి మరొక తల్లి దగ్గర పాలు తాగినావు. ఇదే విషయాన్ని ఆండాళ్ అమ్మ **ఒరిత్తి మగానాయ్ పిరందు**... అనే పాశురములో వివరించింది. అలాగే నీచేష్టితాలు సాధారణ పిల్లవాడివిగా లేవు. పాలు ఇవ్వటానికి వచ్చిన పూతన యొక్క ప్రాణాలను పాలతో పాటుగా పీల్చి వేసినవాడివి. ఆకలితో ఏడుస్తూ కాళ్ళు చేతులూ ఆడిస్తూ ఒక్కసారిగా కాళ్ళను చాబితే గాలిలో ఎగిరి ప్రాణాలు పోగొట్టుకున్న శకటాసుర వృత్తాంతం ఏమయినా సాధారణ విషయామా! అలాగే అల్లరి బాగా చేస్తున్నావు అని నిన్ను మీ అమ్మ యశోద రోటికికట్టివేస్తే. ఆ రోటిని లాగుకుంటూపోయి రెండు మద్ది చెట్ల మధ్యనుంచి పోయి ఆ చెట్ల రూపంలో ఉన్న నలకూబర, మణిగ్రీవులకు శాప విమోచనం చేసినావు. **కణ్ణినున్ శిఱుత్తాంబినాల్ కట్టుణ్ణ పణ్ణియ పెరుమాయన్** అని ఆళ్వార్లు కూడా కీర్తించినారు కదా! ఇవన్ని బాలుడి చేష్టలా కావు. నీవు శిశువు రూపంలో ఉన్న పరమాత్మవే. వారందరికి మరణాన్ని ప్రసాదంగా ఇచ్చి వారికి ముక్తిని పరమపదాన్ని ఇచ్చిన పరమపదనాథుడివే. ★

# గోదా వైభవము



## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై చెప్పిన**

**81 వాక్యరత్నాలలోని అందులో 11 వ భాగవతోత్తమురాలు గోదాదేవి యొక్క వైభవాన్ని గూర్చి తెలుసుకుందాము.**

**పింజాయ్ పజుత్తేనో ఆండాళై పోలే**


**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుందు, రాజమండ్రి.**


పిన్న వయసుతోనే ఆండాళమ్మకు కలిగిన జ్ఞాన భక్తి వైరాగ్యములు, ఆచార్య నిష్ఠ కలిగి పరమాత్మను పొందాలి అనుకున్నానా లేదే! అంటూ, మరి అటువంటి నిష్ఠ లేని నేను తిరుక్కోళూరులో ఉండతగను కదా, అని, తిరుప్పావై జీయ్యరుగా, గోదాగ్రజునిగా, ప్రసిద్ధి కల భగవద్రామానుజులకు గోదమ్మ వైభవం తెలియ చేస్తున్నారు పెణ పిళ్ళై గారు.

పూర్వము త్రేతాయుగంలో విదేహ రాజ్యంలో, మిథిలానగరంలో, జనక చక్రవర్తికి, యజ్ఞ నిర్వహణ నిమిత్తంగా భూమిని దున్నుతున్న సమయంలో నాగటి చాలులో సాక్షాత్తు శ్రీమహాలక్షియే సీతాదేవి రూపమున ఆవిర్భవించినట్లుగా, ఈ కలియుగంలో పాండ్య దేశమందలి శ్రీవిల్లిపుత్తూరులో, శ్రీభట్టనాథులు అనే పెరియాళ్వార్ తులసీవనం పెంచుటకు భూమిని తవ్వుతున్నపుడు, భూదేవి చిన్ని శిశువుగా, ఆవిర్భవించింది. కర్కాటకమాసం, పూర్వఫల్గుణి నక్షత్రమున అవతరించిన విష్ణుచిత్తుల ముద్దుల పట్టి ఈమె.



సంతతి లేని పెరియాళ్వార్లు ఆమెను భగవంతుని ప్రసాదముగా తలిచి 'కోదై' అను నామకరణం చేసి, పరమానందంతో ఆమెను పెంచుకుంటున్నారు. వయసుతో పాటు భగవద్ భక్తి కూడా పెరుగుతూ గోదమ్మ పరభక్తి పరజ్ఞాన పరమాభక్తిగా పెరుగుతోంది.

భగవంతుడైన ఆ శ్రీమన్నారాయణుని మాత్రమే భర్తగా వరించాలని నిశ్చయించుకుని, నిత్యము ఆస్వామి వైభవమును స్మరిస్తూ, కీర్తిస్తూ కాలం గడుపుతోంది. ప్రతి దినము శ్రీవిల్లిపుత్తూరులో వెలసియున్న వటపత్రశాయి పెరుమాళ్ళకు సమర్పించుటకు పూమాలలు కట్టుట భట్టనాథులకు అలవాటు, తన తండ్రి కట్టిన మాలికలను రహస్యంగా గోదమ్మ తాను, ధరించి అద్దంలో తన రూపం చూసుకుంటూ భగవానునికి తగిన అపురూపం, సౌందర్యం తనకు ఉందా, లేదా అని చూసుకునేది. ఇలా చాలాకాలంగా జరుగుతున్నా గమనించ లేదు విష్ణుచిత్తులు.

ఒకరోజు విష్ణుచిత్తులు చూసి కోపంతో ఈ విధంగా నిత్యం చేస్తున్నావా అని, ఎంతటి అవచారం జరిగింది, అని బాధపడి, స్వామికి పూమాలలు సమర్పించలేదు. చాలా బాధగా అన్యమనస్కంగా గడిపారు. ఆనాటి రాత్రి కలలో విష్ణుచిత్తులకు భగవానుడు కనుపించి, "మాలలు ఎందుకు సమర్పించలేదు" అని ప్రశ్నించగా, జరిగినది స్వామికి నివేదించారు ఆళ్వారు. అపరాధము మన్నింపుడని వేడుకున్నారు. అపుడు స్వామి "గోద ధరించిన మాలలు నాకు చాలా ఆనందం కలిగిస్తాయి సుమా! అవే నాకు అర్పించు" అని అంతర్ధానమైనారు. నిద్ర నుండి లేచిన భట్టనాథులకు గోదమ్మ సామన్యురాలు కాదని అర్థమైంది. తండ్రి వద్దనే భాగవత, రామాయణాలు అన్ని అభ్యసించింది గోదా. పరమాత్మే భర్తగా (మిగతా 24 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# శ్రవణ కుమారుడి కథ



శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం

**కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం।**
**ఆరూహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥**

శ్రీరామాయణంలో సత్యసంధుడైన దశరథ చక్రవర్తి ఆడిన మాట తప్పకూడదనే సామాన్య ధర్మాన్ని పాటించి తన చిన్న భార్య కైక కోరిక మేరకు శ్రీరాముడిని వనవాసానికి పంపించాడు. కానీ శ్రీరాముడు వనవాసానికి వెళ్ళిన తరువాత పుత్ర శోకాన్ని తట్టుకోలేక పోయాడు. అప్పుడు తాను యౌవ్వనంలో ఉండగా జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చింది. ఆ కథను కౌసల్యతో చెప్పాడు.

**యదాచరతి కళ్యాణీ శుభం వా యదివా2 శుభమ్।**
**తదేవ లభతే భద్రే కర్తా కర్మజ మాత్మనా॥**

(శ్రీ.రా.అ.కాం.63.6)

“ఓ కళ్యాణీ! మానవుడు తాను చేసిన పుణ్యపాప కృత్యాల ఫలితంగా సుఖదుఃఖాలను పొందుతాడు.’ ఈ లోకంలో మూర్ఖులు అజ్ఞానంతో విషాన్ని తిని చనిపోతారు. అలాగే యవ్వనంలో ఉండగా నేను తెలియక అపరాధం చేశాను. దాని ఫలితంగా ఇప్పుడు ఈ పుత్ర శోకాన్ని అనుభవిస్తున్నాను” అన్నాడు.



నాకు శబ్ద భేది విద్య తెలిసి ఉండటం వలన శబ్దాన్ని బట్టి లక్ష్యం ఛేదించే నైపుణ్యం ఉండేది. అలా లక్ష్యాన్ని ఛేదించడంలో ఆనందం ఉండేది. వర్షఋతువులో ఒక రోజు రాత్రి సరయూ నదీ తీరంలో వేట కోసం వెళ్లి చెట్ల చాటున పొంచి ఉన్నాను. ఆ వేళలో నీళ్ళు తాగడం కోసం అడవి దున్నలు, ఏనుగులు అక్కడకు వస్తాయి. వాటిని వేటాడటం కోసం అక్కడికి వెళ్ళాను.

**అథాంధకారే త్వశ్రౌషం జలే కుంభస్య పూర్యతః।**
**అచక్షుర్విషయే ఘోషం వారణస్యేవ నర్దతః॥**

(శ్రీ.రా.అ.కాం.63.22 )

ఆ సమయంలో అంతటా చీకట్లు కమ్ముకొని ఉన్నవి. నీటిలో కడవను ముంచుతున్న ధ్వని వినపడింది. కానీ ఏనుగు నీళ్లు తాగుతున్న ధ్వని లాగా నాకు తోచింది. ఏనుగును చంపాలన్న కోరికతో బాణాన్ని వేశాను. శబ్దభేది విద్య తెలిసి ఉండడం వల్ల శబ్దం ఎటు దిక్కు వచ్చిందో అటువైపు గురిపెట్టి బాణం వేశాను. వెంటనే ఒక ఆర్తనాదం వినపడింది. ‘ఈ నదీ తీరంలో ఈ రాత్రివేళ నీటి కోసం నేను వస్తే, నన్ను బాణంతో కొట్టింది ఎవరు? నేను ఎవరికి ఏ అపకారం చేశాను’ అని హాహాకారాలు వినపడ్డాయి. దురదృష్టవశాత్తు నేను వేసిన బాణం ఒక ముని కుమారుడికి ఆయువు పట్టున తగిలింది. అప్పుడు ముని కుమారుడు

**కిం తవాపకృతం రాజన్**
**వనే నివసతా మయా।**
**జిహీర్షురంభో గుర్వర్థం**
**యదహం తాడితస్త్వయా॥**

(శ్రీ.రా.అ.కాం.63.38)

**ఏకేన ఖలు బాణేన**
**మర్మణ్యభిహతే మయి।**
**ద్వావంధౌ నిహతౌ వృద్ధౌ**
**మాతా జనయితా చ మే॥**

(శ్రీ.రా.అ.కాం.63.39 )

‘ఓ మహారాజా నేను ఈ వనంలో నివసించే వాడిని, నా తల్లిదండ్రుల దాహం తీర్చడం కోసం నీళ్ల కోసం వచ్చాను. నేను మీకు చేసిన అపకారం ఏమిటి? ఎందుకు నన్ను బాణంతో కొట్టారు? ఒకే ఒక బాణంతో నా ఆయువు పట్టున దెబ్బ తీశారు. ఈ దెబ్బతో నేను చనిపోతాను. ఈ వార్త

తెలియగానే ముసలివారు, అంధులు అయిన నా తల్లిదండ్రులు కూడా మరణిస్తారు, ఇది తథ్యం. వాళ్ళకు నేను ఒక్కడినే సంతానం. నేను లేకపోతే వాళ్ళ బాగోగులు చూసుకునే వాళ్ళు ఎవరూ లేరు'. అని ఆక్రందన చేశాడు. ఆ మాటలు విని నా మనసు వికలమై పోయింది. సరిదిద్దుకోలేని అపరాధం జరిగిపోయిందని ఎంతో దుఃఖించాను.

ఆ ముని కుమారుడు 'ఓ మహారాజా వెంటనే నువ్వు వెళ్ళి మా తండ్రిగారికి జరిగిన విషయం చెప్పి ఆయన కృపను పొందు. లేకపోతే ఆయన కోపంతో, చెలరేగిన దావాగ్ని అడవిని కాల్చినట్టు నిన్ను దహించి వేస్తాడు.' అని చెప్పాడు. ఇంకా 'నేను బ్రాహ్మణుడిని కాను, నువ్వు భయపడకు. వైశ్యుని వలన శూద్ర స్త్రీకి పుట్టిన వాడను. నీకు బ్రహ్మహత్యా పాతకం తగలదు, ఆ భావం నీ హృదయం నుండి తీసివేయి' అన్నాడు.

ఆ కుండలో నీళ్లు నింపుకొని అతను చెప్పిన గుర్తులు పట్టుకొని భయపడుతూ ఆ ముని ఆశ్రమానికి వెళ్లాను.

'కౌసల్యా నేను చేసిన తప్పుకి కన్నీరు అయ్యాను. కానీ జరగకూడనిది జరిగిపోయింది. దాన్ని మార్చడం ఎవరి తరం కాదు. ఈ తప్పు చేయడానికి నా ఇంద్రియాలు కదా కారణం అని వ్యాకుల పాటు పడ్డాను' అని కౌసల్యతో చెప్పుకున్నాడు.

ఆశ్రమానికి వెళ్ళి శ్రవణుడి తల్లిదండ్రులను చూసి నేను చేసిన మహా పాతకానికి పశ్చాతాపంతో దహించుకు పోతూ వాళ్లకు చెప్పాను. 'నా అజ్ఞానం వల్ల ఈ తప్పు చేశాను. మీ కుమారుడి మరణానికి కారణం అయ్యాను. నన్ను అనుగ్రహిస్తారో! ఆగ్రహిస్తారో! శపిస్తారో! మీ దయ అని నిలబడ్డాను. అప్పుడు ఆ ముని 'ఓ రాజా! నీవు చేసిన ఈ మహా పాపకృత్యాన్ని గురించి స్వయంగా నాకు చెప్పి ఉండకపోతే నీ తల వేలకొద్దీ ముక్కలుగా పగిలి ఉండేది. 'ఓ ప్రభు క్షత్రియుడు బుద్ధిపూర్వకంగా వానప్రస్థుని చంపితే ఇంద్రుడంతటి వాడైనా పదవీ భ్రష్టుడవుతాడు. తపస్సు చేసే బ్రహ్మచారిపై బుద్ధిపూర్వకంగా బాణ ప్రయోగం చేస్తే ఆ పాపి యొక్క తల ముక్కలు ముక్కలుగా పగిలి పోతుంది. నువ్వు తెలిసి చేసి ఉంటే నీ ఇక్ష్వాకు వంశం మొత్తం నాశనం అయి ఉండేది.'.

'మహారాజా నా పుత్రుని చూడాలి అతడు పడి ఉన్న చోటికి మమ్మల్ని తీసుకెళ్లు' అని అంటూ చివరి చూపు కోసం పాకులాడారు. (ఇంకావుంది) ★

# గోదా వైభవము

(22 వ పేజీ తరువాయి) అనుకుంది ధృడంగా.


**మానిడ వర్కు ఎన్ను పేచ్చు పుడిల్ వాజ్ గిల్లేన్** అనేదిట మానవులు ఎవరైనా నిన్ను వివాహ మాడతాను అనేమాట విన్నా, నేనిక జీవించి ఉండను అనేది గోదమ్మ. భగవానుని దక్క వేరొకరిని వివాహము చేసుకోనని ఈమె సంకల్పము ఎలా నెరవేరుతుందో అని భట్టనాథులు చింతాక్రాంతులైనారు. ఇక గోదమ్మ యొక్క భగవద్ ప్రేమ దినదినమూ అధికముగా పెరుగుతూవుంది, ఆప్రేమ యొక్క పరిణామ రూపంగా, ఆమె రెండు దివ్య ప్రబంధములు విరచించి లోకానికి అందించినది.

1) తిరుప్పావై, 2) నాచ్చియార్ తిరుమొళి

గోదాదేవి యొక్క ధృఢమైన నిర్ణయాన్ని తెలుసుకుని విష్ణుచిత్తులు 108 దివ్యదేశాలలో ఏ క్షేత్రం స్వామిని వివాహమాడ దలచావు అనగా, శ్రీరంగ క్షేత్రంలో నున్న రంగనాథుని, అని తెలిపింది.

అర్చారూపియైన స్వామితో వివాహమెట్లో అని విష్ణుచిత్తులు చింతిస్తుండగా శ్రీరంగనాథులు స్వప్నములో, గోదను వెంట పెట్టుకుని శ్రీరంగం రమ్మని చెప్పి, శ్రీరంగ ఆలయ అర్చకులకు కూడా సకల మర్యాదలతో గోదమ్మను వెంట పెట్టుకుని రమ్మని ఆదేశమిచ్చారు. వారు అలానే గోదమ్మను వెంట పెట్టుకొని శ్రీరంగనాథుని వద్ద అప్పగించగా గోదమ్మ శ్రీరంగని దరిచేరి పాద సంవాహనం చేస్తూ అంతర్ధానమైనది.


ప్రతి నిత్యం గోదమ్మ రచించిన తిరుప్పావై ప్రబంధమును, అర్థంతో కూడి అనుసంధానం చేసుకుని తిరుప్పావై జీయరుగా పేరు ప్రసిద్ధి కెక్కిన భగవద్ రామానుజులతో పెణ్ బిళ్లై గారు, గోదమ్మ వంటి భక్తి జ్ఞాన సంపదలేని దాసురాలు ఈ తిరుక్కోళూరులో ఉండతగదు కదా! గోదమ్మలాంటి పాశుర మాలికలు అల్లగల దానిని కాదు కదా! అంటూ తన యొక్క తక్కువతనాన్ని తెలియజేస్తున్నారు పెణ్ పిళ్ళైగారు.



# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు

**ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతి స ఏవ అసాధుకర్మ కారయతి తం యమధోనినీషతి॥** (కౌషీతకి 3-9) ఏ జీవుడిని ఈ ప్రాకృతలోకాలనుండి ఉద్ధరించవలెనని పరమాత్మ కోరునో, వానిని ఈయనే మంచికర్మలు చేసేటట్లు చేస్తాడు. ఏ జీవుడిని ఈ పరమాత్మే అధోలోకాలలో త్రోసివేయదలచుకున్నాడో, ఆ జీవుడిని ఈయనే పాపకర్మలు చేసేటట్లు చేస్తాడు.

**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే**

(గీ.10.11)

నన్ను పొందేమార్గంచూపే బుద్ధిని నేనే వాళ్ళకి ఇస్తాను

**తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్।**
**క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు॥**

(గీ.16.19)

నన్ను ద్వేషించే క్రూరులను నేనే సంసారాల్లో, అందులోనూ అసురజన్మలలోనే ఎప్పుడూ తోసివేస్తాను అని పరమాత్మయే జీవుడిని పుణ్యపాపకర్మలలో ప్రేరేపించి దానికనుగుణమైన ఫలాలను ఇస్తాడని కొన్ని శ్రుతి స్మృతివాక్యాలు చెప్పటంలో అర్థం ఏమిటి? అంటే, పరమాత్మచేత మొదటి ప్రయత్నంలో ప్రసాదించబడిన స్వాతంత్ర్యాన్ని సరిగా ఉపయోగించుకొని ఎవరు పరమాత్మకి చాలా అనుకూలంగా ఉంటారో (ఇచట భగవద్రామానుజులు ఈ ఉపనిషద్వాక్యములకు వేదార్థ సంగ్రహమందు ప్రసాదించిన వివరణము కూడ గమనీయము.) వాళ్ళని పరమాత్మ పుణ్యకర్మలను, ఇంకా ఇంకా చేసేటట్లు ప్రేరేపించి వాళ్ళకి మంచి గతులను కల్పిస్తాడు. అనిన్నీ ఎవరైతే స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగ పరుస్తారో ఎవరైతే పరమాత్మకి చాలా ప్రతికూలులుగా ఉంటారో, వాళ్ళని పాపకర్మలు ఇంకా ఇంకా ఎక్కువగా చేసేటట్లు ప్రేరేపించి వాళ్ళకి దుర్గతులని కల్పిస్తాడు అనిన్నీ ఆ శ్రుతిస్మృతులు చెప్తున్నాయి గనుక, ఇవికూడా జీవుడి ఇదివరకటి ప్రథమ ప్రయత్నాల ఫలములే. ఇట్లా పూర్వ ప్రయత్నాలలో పరమాత్మ జీవుడిని కార్యం చెయ్యటానికి అనుమతించటం పూర్వప్రయత్నముల ఫలమే.

మొదటి ప్రయత్నంలో కొంతమందిని నిలబెట్టటం మొట్టమొదటిప్రయత్నాల ఫలమే గనుక, ఏ దోషమూ లేదు. మొదటి ప్రయత్నంలో పరమాత్మకి కారయితృత్వమనే విశేషకారణత్వం లేకపోయినా, జీవుడికి ఆ స్వతంత్రబుద్ధిని కలిగించినవాడు పరమాత్మే కనుక, జీవకర్తృత్వ విషయంలో సామాన్య కారణత్వం ఉండనే ఉన్నది. కనుక, పరమాత్మ యొక్క సర్వకారణత్వానికీ లోటు రాలేదు. కనుక, జీవుడికర్తృత్వం పరమాత్మాధీనమే.

ఇంతవరకూ పరాయత్తాధికరణసారంగా ఇక్కడ వ్రాయబడినవి ఆ అధికరణంతాలూకు శ్రుతప్రకాశికా వ్యాఖ్యాసంగ్రహం. పిళ్ళైలోకాచార్యులవారి తత్త్వత్రయంలో ముప్ఫైయైదవ సూత్రం **కర్తృత్వన్దాన్ ఈశ్వరాధీనమ్** అన్న సూత్రంతాలూకు వ్యాఖ్యానంలో మణవాళమామునులుకూడా ఈ పక్షాన్ని ఆదరించేరు. అక్కడ వాదికేసరి జీయర్ నడాదూరమ్మాళ్ సాయించిన తత్త్వసారంలోని

**ఆదావీశ్వరదత్తయైవ పురుష స్స్వాతన్త్ర్యశక్త్యా స్వయం తత్తదా**
**నచికీర్షణప్రయతతాన్యుత్పాదయన్ వర్తతే।**
**తత్రోపేక్ష్యతతోనుమత్య విదధత్తన్నిగ్రహానుగ్రహౌ**
**తత్తత్కర్మఫలమ్ ప్రయచ్ఛతి తతః సర్వస్య పుంసో హరిః॥**

దానికి అర్థం "మొదట్లో సర్వనియంతయై, సర్వాన్తరాత్మయైన సర్వేశ్వరుడు తనకి కలిగించి ఇచ్చిన జ్ఞాతృత్వరూపమైన స్వాతంత్ర్య శక్తిచేత ఈ పురుషుడు తానే ఆయా విషయాల్లో జ్ఞానచికీర్షాప్రయత్నాలను చేస్తూంటాడు. అప్పుడు అశాస్త్రీయాలలో ఉపేక్షించేటంత, శాస్త్రీయాలలో అనుమతించటం చేసి, ఆయా విషయాల్లో నిగ్రహానుగ్రహములను చేస్తూ ఆయా కర్మఫలాలను, సర్వేశ్వరుడు ఇస్తూంటాడు."

(సశేషం)

ఆధ్యాత్మిక సేవలో

# శ్రీరాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్

**వారణాస్యాస్సమం క్షేత్రం రాజేశ్వర మిహ దక్షిణే**
**తతో దక్షిణ కాశీతి సమలేభౌ మహత్పరమ్.**
**అన్న దాన సమం దానం త్రిలోకేషు న విద్యతే**

దక్షిణ దేశమందుగల ఈ రాజరాజేశ్వర క్షేత్రం వారణాసితో సమానమైనదై దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందినది.

అన్నదానం కంటే సమానమైన దానము ఈ మూడు లోకాల లోనూ ఉండదు.

సనాతన హిందూ ధర్మ పరిరక్షణకై శ్రీరాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ (రిజిస్టర్డ్ 46/20) స్థాపించబడినది. భగవంతురావునగర్ వేములవాడ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

హిందూ ధర్మ సంరక్షణ కోసం తమవంతు కర్తవ్యంగా అగ్రహారం డిగ్రీకళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన డాక్టర్ మామిడిపల్లి రాజన్న గారు కొందరు ఔత్సాహికులైన సభ్యులతో కలిసి ఈ సంస్థని ప్రారంభించారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేములవాడలో మార్చ్ 2020న ఈ ట్రస్ట్ ఆవిర్భవించింది.

ఆరంభమైన అనతికాలానికే ప్రపంచాన్ని అలకల్లోలం చేసిన కరోనా రావడం వలన ఆ సమయంలో వీరి సేవలు మరింత విస్తరించాయి. వేములవాడలో దాతల సహకారంతో దేవాలయానికి వచ్చే భక్తులపై ఆధారపడే భిక్షకులకు అన్న ప్రసాద వితరణ మరియు వారికి అవసరమయ్యే వస్త్రాలను బియ్యం వంట సామాగ్రి మొదలగునవి పంపిణీ చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయటం వంటి అనేక సమాజ హిత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. హోమాలు, కార్తీక దీపోత్సవాలు, ప్రత్యేకపూజలు, అనుభవజ్ఞులైన పండితుల చేత (మైలవరపు గారిచే) పురాణ ప్రవచనాలు చెప్పించడం జరిగింది. సంస్థ ఏర్పడిన కొద్ది రోజులకే తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి కరకమలముల మీదుగా 'నందిని గోశాల' రాజరాజేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అది దినదిన ప్రవర్ధమానం అవుతూ ఉంది.

హిందూ ధర్మ పరిరక్షణ మరియు ప్రచార ప్రోత్సాహంలో సానుకూల శక్తిగా ఎదగాలని విద్యార్థులలో, యువతలో నైతిక విలువల స్పృహ కలిగించాలని, భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పట్ల నవతరానికి అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రధాన లక్ష్యంతో, సదుద్దేశంతో శ్రీరాజ రాజేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ ట్రస్టు ముఖ్య సలహాదారుగా గల స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ మధురాజేంద్ర గారి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయి.


**సంస్థ ప్రధాన కార్యక్రమాలు**

సనాతన ధర్మ సేవలో భాగంగా దైవభక్తిని ప్రోత్సహించుట. యజ్ఞక్రతువులను జరిపించుట. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ. గ్రామ ప్రాంతాలలో ఆరోగ్య సేవాశిబిరాలు నిర్వహించుట. ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుట. ప్రతిభగల విద్యార్థులకు ఆర్థిక సహాయము అందించుట. వేములవాడ పుణ్యక్షేత్రంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్వదినాలలో, ప్రత్యేక దినాలలో పూజలు లింగార్చనలు గణపతి హోమాలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించుట ప్రముఖ పండితుల








చేత ఆధ్యాత్మిక ప్రవచనాలను చెప్పించుట.

ట్రస్ట్ కార్యక్రమాల విస్తరణలో భాగంగా భీమేశ్వర ఆలయ వీధిలో విశాల ప్రాంగణంలో శ్రీబాలాంబికా సేవాసదన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సేవాసదనంలో వివాహాలు అన్న సమారాధనలు, కేశఖండనము ఇత్యాది శుభకార్యాలు కొనసాగుతున్నాయి. వ్యవస్థాపకులు, సభ్యులు, సహృదయుల సహకారంతో శ్రీరాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ మరిన్ని కార్యక్రమాలను నిర్వహించే ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నది.

ట్రస్ట్ వివరాలు వెబ్సైట్లో మరియు యూట్యూబ్ ఛానల్ ఎస్.ఆర్. ఆర్. సి.టి లో విశేషంగా పొందుపరచబడ్డాయి.





# జ్యోతిర్విజ్ఞానమ్

(20 వ పేజీ తరువాయి) సాక్షాత్తుగా ఆరోగ్యానికి అమృతవల్లి, సంపదలకు కల్పవల్లి అవుతుంది. ఇదే విషయాన్ని ఒక మహానుభావుడు ఇన్నిన్ని నక్షత్రాలు, ఇన్నిన్ని తిథులు కలిసిరావాలంటే కాలంలో చాలా ఆలస్యం అవుతుంది. కనుక ఒక స్వాతి నక్షత్రము, రోహిణి నక్షత్రం గురించి చెపుతూ పద్యంలో ఇలా సూచించారు.

**స్వాతిరోజున లక్ష్మితులసి కోటనునాట**
**తరగని సంపదలు తరలి వచ్చు**
**లక్ష్మిప్రక్కన కృష్ణతులసి రోహిణియందు**
**చేర్చగా సుఖశాంతులు ఇనుమడించు**
**రెండునొక్కచోట కూడిన ఆఇంట**
**పాడిపంటలుప్రేమ నిండియుండు**
**కలుగు ఆరోగ్యసౌభాగ్య సంపదలును**
**అనుచు బలికిరి భువిన ఆదిమునులు**

అని తులసి వృక్ష మహిమను ఆవిధముగా లోకానికి అందించారు

ప్రాచీనకాలంలో తులసితో పాటుగా బిళ్ళ గన్నేరు అంటే కొన్ని ప్రాంతాలలో నందివర్ధనం అంటారు. చిన్నగా వుండి ఎరుపు రంగు పూలు పూస్తాయి. ఆయుర్వేదంలో దీనికి రోగ నిరోధక వృక్షము అని పేరు. తులసి, నందివర్ధనం కలిపి పెట్టుకునేవారు. తద్వారా దీర్ఘ వ్యాధులు రాకుండా వుంటాయని, వచ్చిన వారికి ఉపశమన కలుగుతుందని తెలియజేశారు. కొన్ని దేశాలలో, ప్రాంతాలలో ఈ బిళ్ళగన్నేరు మొక్కలు పెంచాలి, దానిద్వారా ఔషధాలు సేకరించాలని ప్రయత్నాలు చేసినా ఇవి పెరగడమే లేదు. దీర్ఘకాలిక వ్యాధులకు, మానసిక శాంతికి ఈ తులసి, బిళ్ళగన్నేరు నుండి వచ్చే గాలే కాకుండా దాని నీడలో వుండే మట్టితో స్నానం చేసినా గాని అనేకమైన వ్యాధులు నయం అవుతాయని తెలుస్తుంది. తులసి మొక్కను ఆయా తిథి వార నక్షత్రాల్లో పెట్టుకోవడం ద్వారా అద్భుత ఫలితాలు పొందుతారని, పొందాలని ఈ సంచిక ద్వారా తెలుసుకొంటున్నాము. ముందు సంచికలలో మరికొన్ని మొక్కల గురించి తెలుసుకునే ప్రయత్నంచేద్దాం.

(మరికొంత వచ్చే సంచికలో తెలుసుకుందాం)



# ఋషి వాక్య ప్రబోధాలు



**శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి**

**స్వాధ్యాయ ప్రవచనే**
**ఏవేతి నాకో మౌద్గల్యః।**
**తద్ధి తపః తద్ధి తపః॥** (తైత్తరీయోపనిషత్)

పెద్దల దగ్గర నుండి పలుపలు గ్రంథాలు వింటూ ఆ విన్న విషయాలను నలుగురికి చెప్పడం వలనే స్వర్గస్థితి కలుగుతుందని "మౌద్గల్య" మహర్షి (స్వాధ్యాయమును గూర్చి) తపస్సు ఇదేనని ఉపదేశించారు.

**అవిద్యాయాం అన్తరే వర్తమానాః**
**స్వయం ధీరాః పండితం మన్యమానాః।**
**జంఘన్యమానాః పరియంతి మూఢాః**
**అన్ధేనైవ నీయమానాః యథాన్ధాః॥**

(ముండకోపనిషత్తు 8వ మంత్రము)

అజ్ఞానంతో ఉన్నవారు తమకు తామే బుద్ధిమంతులము. ఊహాపోహ క్షమ జ్ఞానము కలవారమని తలచుకొనుచూ తాపత్రయాలతో (జన్మ, జరా, మరణ దుఃఖాలను) దుఃఖించుటయే కాదు మూర్ఖ స్వభావులై ఒకగ్రుడ్డివాడు మరోగ్రుడ్డి వానితో కలిసి పయనిస్తున్నట్లుగా ఈ సంసారములో పడి గిరగిరా భ్రమిస్తూనే ఉంటారు.

**ఏకోపి పుత్రో ధర్మాత్మా**
**సర్వం తారయతే కులమ్।**
**పుత్రేణ లోకాన్ జయతి**
**శ్రుతిరేషా సనాతనీ॥**

(గరుడ పురాణము)

ధర్మాత్ముడగు కుమారుడు ఒక్కడున్నా చాలు. వారి వంశస్థులందరూ తరిస్తారు. అని సనాతన వేదము కూడా అట్టి కుమారుని కలవారు సమస్తలోకాలను జయించెదరని బోధించినది.

**యత్రాధికారవాంఛా మహతీ**
**తత్రావిధేయతా అపి తథా।**
**స్వామీ హి నస్తి భృత్యాన్**
**భృత్యో భవతి హ్యనా శ్రవో నూనమ్॥**

ఎక్కడ అధికారవాంఛ మితి మీరుతుందో అక్కడ అవిధేయత నిర్లక్ష్యం కూడా అమితంగా ఉంటుంది. అట్టి యజమాని సేవకులను మితిమీర హింసిస్తాడు. విసిగిపోయిన సేవకులు ఎదురు తిరుగుతారు. అవిధేయులౌతారు. కాబట్టి మితిమీరి అధికారాన్ని దుర్వినియోగం చేయరాదు.

(ముక్తక మౌక్తిక మాలా)


**దేహినోస్మిన్ యథా దేహే**
**కౌమారం యౌవనం జరా।**
**తథా దేహాంతరప్రాప్తిః**
**ధీరః తత్ర నముహ్యతి॥** (భగవద్గీత 2 అ॥)

జీవుని శరీరానికి, బాల్యము, యౌవనము, ముసలితనము ఎలా కలుగుతున్నాయో, అలాగే జీవుడు మరణము తరువాత మరొక శరీరాన్ని పొందుతాడు. కాబట్టి ఈ సత్యాన్ని గమనించిన జ్ఞాని (ఈ విషయంలో) శోకించడు. మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఇది శ్రీకృష్ణ పరమాత్ముని గీతా సందేశము.

**కృష్ణ నామ్నా న నరకం**
**పశ్యంతి గత కిల్బిషాః।**
**యమం చ తద్భటాన్ చైవ**
**స్వప్నేపి న కదాచన॥** (గరుడపురాణము)

శ్రీకృష్ణ నామస్మరణ వలన పాపం తొలిగి నరకాలను పొందరు. అట్లే యమధర్మరాజు గాని వారి భటులు గాని కలలో గూడా వారి చెంతకు రారు.

# వానమామలై దివ్య చరిత్ర



శ్రీమతి వనం ఉషారాణి

దాక్షాయణి తండ్రి దక్షమహారాజు తాను చేసిన యాగముకు రమ్మని శివుని ఆహ్వానించలేదు. ఇందుకు శివపార్వతులు ఆగ్రహించినారు. దేవతలందరినీ సంహరించాలని వారి భూత గణాలను పంపినారు. ఆ పరిస్థితిలో సూర్యచంద్రులు విష్ణుమూర్తిని శరణాగతి చేసుకున్నారు. భయం పోయిన తరువాత సూర్యచంద్రులు స్వయంభువుగా ఇక్కడ పెరుమాళ్ళ దగ్గరనే ఉన్నారు.

మార్కండేయుడు పరదైవం ఎవరని తెలుసుకోవాలని వైకుంఠం వరకు వెళ్ళి అక్కడ తోతాద్రి (అంటే వానమామలై) మహిమ తెలుసుకుని, వానమామలైయే పరతత్వమని తెలుసుకుని పెరుమాళ్ళ దగ్గరనే ఉండిపోయాడు.

ఊర్వశి తిలోత్తమ ఇద్దరూ పోటీపడి అందంలో తిలోత్తమే అందమైనదని చివరకు ఊర్వశి కూడా ఒప్పుకున్నది. ఇంద్రలోకంలో ఉన్నవారిని సంతోషపరిస్తే మాకేం వస్తుంది?, మన ఆత్మకు ఏది సంతృప్తినిస్తుంది అని ఆలోచించి ఇద్దరూ వానమామలై స్వామి వారికి చామర కైంకర్యం చేస్తూ ఉన్నారు. ఈ భూలోకం ఉన్నంతవరకు ఈ కైంకర్యం సాగుతూనే ఉంటుంది. భృగుమహర్షి కూడా ఇక్కడ ఉన్నారు. పరమపదంలోని విశ్వక్సేనులు ఇక్కడ వానమామలైలో రెండు భుజములతో యుండి ఇక్కడికి వచ్చే భక్తులను చూసి సంతోషపడుతూ అదే మన భాగ్యమని సన్నిధి దగ్గర అందంగా కూర్చున్న భంగిమలో ఉంటాడు.

వానమామలైలో ఎంతో వైభవంగా పెరుమాళ్ళు సభామండపంలో ఎట్లా ఉంటారో అచ్చంగా అట్లానే కూర్చున్న భంగిమలో ఉన్నారు. భక్తులు ఎవరైతే తన తిరువడిపై ఆశ ఉన్నదో వారికి తన పాదాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తన చేయిని తిరువడి వైపు చూపిస్తూ ఉంటాడు. కష్టాలు వచ్చేముందే కాపాడటానికి ఉన్నానని ప్రయోగ చక్రంతో దర్శనం ఇస్తారు. సుదర్శన చక్రాన్ని విసరబోయేలా ఉండి, దుష్టులతో కష్టాలతో పోరాడుటకు సిద్ధంగా ఉన్నట్టు దర్శనం ఇస్తారు ఇక్కడ పెరుమాళ్ళు.

ఇంత వైభవంగా ఉన్న స్వామివారిని దర్శించినందుకు రోమస మహర్షికి జన్మగుడ్డి పోయి చూపు వస్తుంది. సంతోషంగా స్వామివారికి వెయ్యి సంవత్సరాలు ఆరాధన చేసుకున్నారు. ఆ సమయంలో తిరుమంజన క్రమంలో తైలకాప్పు చేస్తారు. ఇటువంటి తోతాద్రి వైభవం నలుమూలలా వ్యాపించింది. ఆ తైల ప్రసాదం స్వీకరించిన వారికి చర్మ వ్యాధులన్నీ పోతాయి. ఆ ప్రసాదం అందరికీ లభించాలని రోమస మహర్షి బావి కూడా తవ్వించినారు. అభిషేక తైలమంతా దాంట్లో ఉంచుతారు. తరువాత అగస్త్యముని ఈ తైలం మహిమ తెలుసుకుని తన వైద్య పుస్తకంలో విశేషంగా వ్రాసినారు. తైలబావి దగ్గర అగస్త్యుని విగ్రహం కూడా ఉన్నది. అప్పుడు చాలారోజుల క్రితం వరకు అగస్త్యునికి కూడా ఆరాధన జరుగుతూ ఉండేది. కాలక్రమేణా రాజులు మారారు. వాతావరణ మార్పుల వల్ల స్వామివారి కోవెల, బావి, ఊరు అన్నీ భూగర్భంలో కలిసిపోయినాయి.

కారి మహారాజు ఆ ప్రాంతంలో పాలించే సమయంలో తనకు పుత్ర భాగ్యం ప్రసాదించమని తిరుక్కురుంగుడి నంబిని ఆశ్రయించి ప్రార్థించినాడు. "నేనే నీకు పుడతానని" కారి మహారాజుకు స్వప్నంలో వచ్చి చెప్పినాడు నంబి. నిద్ర నుంచి లేచిన కారి మహారాజు నంబికి పెద్ద కోవెల కట్టాలని నిర్ణయించుకుని, ఆ ప్రయత్నంలో పనివారినీ సామగ్రినీ తిరుక్కురుంగుడికి పంపిస్తాడు. ఆశ్చర్యంగా ఒక్క రాత్రిలోనే తెల్లవారేసరికి గుడి కట్టేయబడుతుంది. సూర్యోదయం తరువాత ఎవ్వరూ కనబడరు, కోవెల గోపురం మాత్రం కొంతవరకే కట్టియున్నట్టు కనబడుతుంది. ఆ (మాలై మేల్ నంబి అంటే కొండపైనున్న నంబి) గుడి దర్శనం చేసుకుంటే మనకు తెలుస్తుంది. కారి మహారాజుకు భయమేస్తుంది. తన కైంకర్యం స్వామివారికి నచ్చలేదేమోనని విచారిస్తాడు. అప్పుడు నంబి కలలోకొచ్చి తోతాద్రి నాథుడు భూగర్భంలో ఉన్నాడు, ఆయనను జాగ్రత్తగా పైకి తెచ్చి కోవెల కట్టమని ఆజ్ఞాపిస్తాడు. తోతాద్రి ఎక్కడ వుందని మహారాజు అడగగా "మన గుడి నుండి తోతాద్రినాథుడు (మిగతా 31 వ పేజీలో)

# తెలుసు కోవలసినవి మూడే!



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

(క్రిందటి సంచిక తరువాయి)

ఈ జీవునకు ప్రధానమైన లక్షణం శేషత్వము. (భగవానుని ఇష్టమునకు అనుగుణముగా ఉపయోగపడుట) అని తెలిపి. ఈ జీవుని శేషత్వం కేవలం భగవానునికే కాక ఆయన భక్తులకుకూడా చెందియుండును. ఈ జీవుడు భగవానునికి ఆయన భక్తులకూ కూడా శేషభూతుడే యని తెలిపిరి. భగనానునికన్నా ఆయన దాసులై భాగవతోత్తములకు దాసుడిగా శేషుడుగా యుండుటయే గొప్పది. భగవానునికి మిక్కిలి ఆనందము కలిగించునది. ఎట్లనగా మనని గౌరవించినచో మనకు కలిగే ఆనందంకన్నా మన పిల్లలను గౌరవించినచో కలుగు ఆనందము ఎట్లు గొప్పదో అట్లే ఇదికూడా.

ఇట్లు జీవుడు భగవానునికి ఆయన భక్తులకు (భాగవతోత్తములకు) ఉపయోగ పడుట ఎట్లో చెబుతూ చందన కుసుమాదులవలే ఉపయోగపడవలెనని, అచిత్ పదార్థములైన చందన కుసుమాదులను ఉదాహరణగా చూపిరి, జీవుడు చైతన్యంగలవాడు. కానీ చందన కుసుమాదులు చైతన్యంలేనివి కదా! చైతన్యం గల జీవుని లక్షణమైన శేషత్వమును చెప్పుటకు చైతన్యంలేని పదార్థములైన చందన కుసుమాదులను ఉదాహరణగా చూపుట ఎందులకు అది ఎట్లు కుదురును అనగా ఈ జీవునికి కేవల శేషత్వమేకాక పారతంత్ర్యముకూడా ఉండవలెను అని తెలుపుటకు.

పారతంత్ర్యము అనగా ఒకవస్తువు తనకంటూ ఎట్టి స్వాతంత్ర్యము లేక ఉపయోగపడుటలో తనకు ఎట్టి ప్రయత్నములేక, ఎట్టి ఆలోచన లేక మరియు ఇట్లే ఉపయోగ పడవలెను అనే ఉద్దేశము లేకుండా ఆ వస్తువును ఉపయోగించుకునే వ్యక్తికి ఎట్లు ఉపయోగింపబడుతుందో అట్లు ఉపయోగపడుట. ఈ జీవుడు కూడా భగవానుడు తనను తన కైంకర్యమునకు ఉపగించుకునేటపుడు అట్లే అచేతమైన ఒక వస్తువువలె ఉండవలెను యను విషయమును తెలుపుటకు అట్లు చెప్పిరి. దీనివల్ల ఆత్మయొక్క యదార్థమైన స్వరూపము పారతంత్ర్యముతో కూడిన శేషత్వమేయని మనకు స్పష్టముగా తెలిపిరి.

ఈ ఆత్మ స్వరూపము పారతంత్ర్యముతో కూడిన శేషత్వము యను విషయమును మన ఆళ్వార్లలో ప్రధానులైన ప్రపన్న జన కూటస్థులైన నమ్మాళ్వార్లు కూడా తమ తిరువాయ్ మొజి 2వ పత్తు 9వ దశకములో స్పష్టముగా తెలిపిరి. అది ఎట్లనగా స్వామి ఆళ్వార్లను కటాక్షించి ఆళ్వారే మీకైంకర్యమును మేము స్వీకరించెదము అని తెలిపి తన నిత్యదర్శనమును అనుగ్రహించగా, ఆళ్వార్లు స్వామీ నీవు ఇచ్చిన ఈ నిత్య దర్శనము నాకొరకు ఇచ్చితివా నీకొరకు ఇచ్చితివాయని అడిగిరి. ఓస్వామీ నీవు నాకొరకే ఇచ్చినచో ఇది నాకు వద్దు. నీవు నన్ను నీకొరకుగానే స్వీకరించుయని "తనక్కేయాక ఎనైక్కొళ్లుమీదే" ఓస్వామీ నీవు నా కైంకర్యమును స్వీకరించునపుడు నాకొరకుగా కాక నీకొరకే నన్ను స్వీకరించుయని ప్రార్థించిరి. ఇట్లు తనస్వరూపము కేవల శేషత్వముకాదు పారతంత్ర్యముతో కూడిన శేషత్వముయని ఆళ్వార్లు తెలిపిరి.


ఇట్లే లక్ష్మణస్వామి కూడా తెలిపిరి. చిత్రకూట పర్వత ప్రాంతంలో మంచి నీరు, నీడ ఉన్నచోటు చూసి పర్ణశాల నిర్మించమని శ్రీరాముడు లక్ష్మణ స్వామికి తెలిపెను. ఆమాటను విన్న లక్ష్మణుడు ఓస్వామీ నీవు నన్ను కేవలం శేషత్వం మాత్రమే కలవానిగా భావించుచున్నావా? "పరవానస్మి కాకుత్థ్స త్వయి వర్షశతం స్థితే" "ఓ శ్రీరామా కాలతత్వము ఉన్నంత వరకు నేను నీకు పరతంత్రుణ్ణి" యని లక్ష్మణస్వామి తెలిపెను. నీవు నీకు ఇష్టమొచ్చినట్లు నన్ను ఆదేశించి పర్ణశాల నిర్మాణ కైంకర్యమును స్వీకరించుమని ప్రార్థించుట ద్వారా తాను పారతంత్రముతో కూడిన శేషత్వము కలవానినని శ్రీరామునకు తెలిపెను.

శేషత్వము జీవుని లక్షణము. శేషిత్వము (యజమానిగా యుండుట) భగవానుని లక్షణము. ఈ లక్షణములను భగవద్రామానుజులు కూడా ఇట్లు తెలిపిరి ⇨

'పరగత అతిశయాధానేచ్ఛయోపాదేయత్వమేవ యస్య స్వరూపమ్ సశేషః పరః శేషీ" అనగా ఒకరి యొక్క గొప్పతనమును పెంపొందించుట కొరకు ఆయనకు అతిశయము కలిగించుటకు ఇంకొకడు ప్రయత్నించుచు కైంకర్యము చేయుచున్నాడు. ఇట్లు కైంకర్యము చేయువాడు శేషము అనగా శేషత్వముయను లక్షణము కలవాడు. వానియొక్క కైంకర్యమును స్వీకరించునపుడు స్వేచ్ఛగా తన ఇష్టమును అనుగుణముగా స్వీకరించుచున్నాడు. ఇట్లు స్వీకరించువాడే పరుడు ఆయనే శేషీ ఇట్లు శేష శేషి లక్షణములను నిర్వచించిరి భగవద్రామానుజులు. వీటన్నిటినీ దృష్టియందుంచుకొనే ఈ తత్వత్రయమునందు పిళ్ళైలోకాచార్యులవారు జీవుని ప్రధాన లక్షణము శేషత్వముయని తెలిపి, అదికూడా కేవల శేషత్వముకాదు పారతంత్ర్యముతో కూడిన శేషత్వము యని తెలుపుటకే జీవుడు పరమాత్మకు చందనకుసుమాదులవలే శేషముయని తెలిపియున్నారు.

(మరికొంత వచ్చే సంచికలో తెలుసుకుందాము)

# గోదాకళ్యాణం



స్వర్ణగిరి దేవాలయం, యాదాద్రి భువనగిరి



శ్రీరామాలయం, కొండపలకల, మానకొండూర్

## వానమామలై దివ్య చరిత్ర

(29 వ పేజీ తరువాయి) ఉండే స్థలం వరకు మీకు చీమలు దారి చూపుతాయి. తోతాద్రినాథుడు ఉన్న చోట పైన గరుత్మంతుడు చుట్టూ తిరుగుతూ ఉంటాడు" అని స్వామివారు చెప్పిన తరువాత కారిమహారాజు తన సైన్యంతో వెళ్ళి గరుత్మంతుడు తిరిగే స్థలంలో నాలుగు వైపులా భూమి శుద్ధి చేసి పునాది తీసి జాగ్రత్తగా భూమిని తవ్వుతున్నప్పటికీ కూడా తోతాద్రి స్వామివారికి శిరస్సులో దెబ్బ తగులుతుంది. దాన్ని చూసి కారిమహారాజుకు మనసు నొచ్చుకుంటుంది. ఇప్పుడు ఏం చేయాలని బాధపడుతూ ఉండగా ఆ సమయంలో ఒక పెద్దమనిషికి ఆవాహమై ఏం కంగారు పడవద్దు, చందనాది తైలం పెడితే రణం పోతుందని చెబుతాడు. అక్కడున్న వారందరూ సంతోషించి చందనాది తైలం తెచ్చి స్వామివారి శిరస్సుపై పెట్టి సంతృప్తి పొందినారు. ఆ రోజు నుంచి స్వామివారికి వానమామలైలో చందనతైలం సమర్పిస్తూనే ఉన్నారు. ప్రక్క స్థలం అంతా శుద్ధి చేసి ఆ మూర్తులను (పెరుమాళ్, శ్రీదేవీ, భూదేవీ, చామరకన్యలు, సూర్యుడు, చంద్రుడు, భృగు, మార్కండేయుడు) బయటకు తీస్తారు. గరుత్మంతుడు కొంచెం దూరంలో పెరుమాళ్ళకు వాహనసేవలో స్థిరమైన భంగిమలో ఉంటాడు. కారిమహారాజు సంతోషంగా తనకు తెలిసినంతవరకు కోవెల పద్ధతి ప్రకారం కట్టి తిరుక్కురుంగుడి మలైమేల్‌నంబి వద్దకు వెళ్ళి నమస్కారం చేసుకుంటాడు. నంబి వరంతో కారిమహారాజుకు ఒక మగపిల్లవాడు జన్మిస్తాడు. ఆ పిల్లవాడే నమ్మాళ్వార్లు. తరువాత కారిమహారాజు సంతోషించి తోతాద్రిలో ఒక సరస్సు నిర్మాణం చేస్తాడు. అదే 'సేతుతామరై తీర్థం'. దీన్ని నిర్మిస్తుండగా ఒకప్పుడు భూగర్భంలో కలిసిపోయిన నూనెబావి బయటకి వస్తుంది. దాన్నికూడా సరిగ్గా కట్టించినాడు. ఈ బావిలోనే సకలరోగనివారిణి అయిన నూనె నిల్వ ఉంచుతారు. ఘోరమైన వ్యాధులున్న వారు చాలా మంది వానమామలై వచ్చి ఆ నూనె పెట్టుకుని సేతుతామరై సరస్సులో స్నానం చేసి తోతాద్రినాథుని ప్రసాద సాపాటు ఆరగించి అనేకరకాల వ్యాధుల నుంచి విముక్తులైనారు. కొన్ని సంవత్సరాల ముందు ఈ బావి గురించి తెలిసిన భక్తుడు తన మనోదేహ వ్యాధి నివృత్తి కోసం ఇక్కడ వ్రతమాచరించినారని తెలిసింది. ఇప్పుడు కూడా స్వామివారిని ప్రార్థించుకుని తైలసేవ చేస్తే కోరికలు నెరవేరుతాయి అని ప్రతీతి. (మిగతా వచ్చే సంచికలో)

# నిడిగొండ లక్ష్మీనృసింహస్వామి దేవాలయం






పల్లెలు సంస్కృతికి, మన జీవనమూలాలకి, ఆధ్యాత్మికతకు పట్టుగొమ్మలు. అలాంటి గ్రామాలలో అభయప్రదాతగా శరణన్న వారిని రక్షిస్తూ కొండగుహలలో, దేవాలయాలలో, మందిరాలలో  నిలచి అంతర్యామిగా అన్నింటా ఉంటూ మార్గదర్శిగా నడిపిస్తాడు భగవంతుడు. భక్తవశ్యుడిగా ఉంటూ లక్ష్మీనృసింహరూపంలో  అనేక ప్రాంతాలలో స్వయంభువుగా అవతరించాడు. అలాంటి క్షేత్రాలలో నిడిగొండ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయం తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలోని పెద్దగుట్టపై ప్రకృతి రమణీయ దృశ్యాల మధ్య వుంది. చారిత్రక కాంతులు,చెరువు అందాల నడుమ ఒక గుహలో ఆళ్వార్, ఆచార్య సహితంగా స్వామి వేంచేసి ఉన్నారు. ఈ గ్రామం శాతవాహనులు,రాష్ట్రకూటులు,కళ్యాణి చాళుక్యులు, కాకతీయుల పాలనలో వైభవంగా సాగింది. ఆలయ ద్వారపాలకులు చక్కని అలంకారంతో మండపం వద్ద దర్శనమిస్తారు. ఆ మండపంలో స్వామి వారి విశేష ఉత్సవాలు జరిగేవని చెపుతారు. ఆలయానికి పై భాగంలో శంఖు, చక్రాలు రాతి చిత్రాలు కనపడతాయి. గుట్ట పైభాగానికి చేరితే కొలను, ప్రక్కనే భక్తాంజనేయుడు, ఇంకొంచెం ప్రక్కన  శాతవాహన కాలం నాటిదిగా భావిస్తున్న ఇటుకల నిర్మాణం, దాని ముందుగా బురుజు నిర్మాణం, కోట గోడలు కనిపిస్తాయి. ఇదే గుట్టకు కొంచెం ప్రక్కగా రెండు గుండ్లలో ఒక గుండుకు గరుత్మంతుడు, మరోగుండుకు హనుమంతునితో పాటు అన్నమరాజు పోదిరాజు 16 శతాబ్దిలో కొండపైన కట్టించిన కోనేటి శాసనం చూడవచ్చు.

సుమారు 80 మెట్లు ఎక్కిన తర్వాత  ధ్వజస్తంభం, గరుత్మంతుడు కనపడతారు. గుహలో స్వయంభూ మూర్తితో పాటు ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహ స్వామి దర్శనమిస్తాడు. ఆదిశేషుడి నీడలో లక్ష్మీతాయర్లతో కూడి చతుర్భుజుడై శంఖచక్రాలు అభయ ముద్రతో, హస్తంలో పద్మాన్ని ధరించి ప్రసన్న రూపంతో అపూరూపంగా దర్శనాన్ని అనుగ్రహిస్తారు.

**సేకరణ : కె.వి.జి.కె.ఆచార్య**

గుట్టకి రేఖా రూపంగా భగవద్ రామానుజుల వారు దర్శనమిస్తారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుడు, లక్ష్మీనృసింహుడు ఉత్సవర్లుగా  ఉన్నారు.

ఆరాధనలు ఆగిపోయిన ఈక్షేత్రాన్ని శ్రీమాన్ ఎలపాటి గోపాల్ రెడ్డి, శ్రీమాన్ నరసింహరెడ్డి, ఎలపాటి రాంరెడ్డి, జయపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాధవరెడ్డి మరియు గ్రామస్తులు కలిసి నూతన శిఖర, మండపాదులను నిర్మించి వాహనసేవలు ఏర్పరిచి పునరుద్దరించారు.

2022 లో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారు, యాదాద్రి ఆస్థాన సిద్ధాంతివర్యులు ఉ.వే.శ్రీమాన్ తి.న.చ.





సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి స్వామి వారి ఆధ్వర్యంలో ఆలయం పునర్ వైభవం సంతరించుకుంది.


ప్రస్తుతం ఈ దేవాలయానికి చక్రవర్తుల వారు స్థానాచార్యులుగా, కోయిళ్ కందాడై వారు అర్చకులుగా కొనసాగుతున్నారు.

ఈ ఆలయ వైభవాన్ని తెలుపుతూ ఆలయ పూర్వ స్థానాచార్యులు కో.కం.వెంకట సుందరాచార్యులవారు ఏకాద్రినాథ సుప్రభాతాన్ని ప్రచురించారని, వారి నిర్వాహణ సమయంలో ఆలయం బాగా నడిచిందని చెపుతారు.

వృషభంలో స్వాతి ఆజికియ సింగర్ తిరునక్షత్రం సందర్భంగా అధ్యయనోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్రాలు, పండుగలు, పర్వదినాలు వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

కాకతీయుల కాలం నాటి దేవాలయంగా ప్రసిద్ధి. శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం అన్నిరకాల ఆరాధనలతో విలసిల్లుతున్నది ఈ క్షేత్రం. ★

## విజయవంతమయిన హైందవ శంఖారావం







జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అనేక హిందూ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన "హైందవ శంఖారావం" సభ ఒక హిందూ ధర్మ చైతన్యసభగా ముగిసింది. అనేక ప్రాంతాల నుండి సాధువులు, ఆధ్యాత్మిక వేత్తలు, అన్నిరంగాలలో ప్రముఖులు, రాజకీయ నాయకులు, మఠాధిపతులు పాల్గొన్నారు. ప్రధానంగా హిందువులను సంఘటిత పరచే విధంగా వివిధ అంశాలపై అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా దేవాలయాల నిర్వహణ, స్వయం ప్రతిపత్తి, ఆస్తుల రక్షణ పై పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు. ★

## మహా కుంభమేళా

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఆధ్యాత్మిక సమ్మేళనం మహాకుంభ మేళా. ఈ ఉత్సవాలు జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 26వ తేదీవరకు ముగుస్తాయి. గంగా,యమునా, సరస్వతి పుణ్యనదుల సంగమ ప్రదేశం ప్రయాగ్ రాజ్ (అలహాబాదు)లో జరిగే ఈ ఉత్సవానికి ఒక్క భారత దేశమేగాక ప్రపంచం నలుమూలలనుండి భక్తులు, సందర్శకులు విచ్చేస్తారు. చంద్ర సూర్య, గురుగ్రహ చలనాలను అనుసరించి జరిగే కుంభ మేళా పుణ్యకాలంలో దేవతలంతా ఈ పుణ్య తీర్థంలో వసిస్తారని, వారితోపాటు అమృతమయ స్పర్శ ఉంటుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. సాధువులు,తాపసికులు, అన్నిరకాల ప్రజలు భక్తులు రావటమే కాకుండా, వ్యాపారపు కూడళ్ళుగా ఈ పుణ్య తీర్థ ప్రదేశాలు నిలుస్తాయి. సనాతన సంస్కృతి సంప్రదాయాలు, భగవత్ విశ్వాసం. ముక్తి మోక్షం ఇత్యాది అలౌకిక ఆస్తిక భావనలు, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రతిబింబిస్తాయి. యునెస్కో ద్వారా గుర్తింప బడిన సాంస్కృతిక వారసత్వ పండుగ కుంభ మేళా ఉత్సవం. ★












# ఆచార్య వరివస్య
## ద్రవిడప్రబంధ-వేద-సిద్ధాంత పురస్కారములు



శ్రీమాన్ శ్రీ తి.న.చ. సంపత్‌కుమార కృష్ణమాచార్య సిద్ధాంతిగారి ఆధ్వర్యంలో వారి ఆచార్యులైన శ్రీమదుభయ వేదాంత ప్రవర్తకాచార్య తి.న.చ. గోవిందాచార్యస్వామి, బ్రహ్మశ్రీ త్రిపురారి రామకృష్ణ సిద్ధాంతి గారి కైంకర్యముగా

**"ఆచార్య వరివస్య"** కార్యక్రమము జనవరి 26న ప్రతిష్ఠాత్మకంగా జరిగింది. భక్తులు శిష్యులు నిర్వాహకులు పండితులు దాతలు ఆహ్వానితుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో "ద్రవిడప్రబంధ వేద సిద్ధాంత పురస్కారములు" నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర దేవాలయము, బాణాపురం జనగామలో జరిగిన ఈ సభ ఆద్యంతము కన్నుల పండుగగా సాగింది. పురస్కారగ్రహీతల బిరుదు సత్కారములు చిన్నజీయర్‌స్వామివారి కరకమలముల మీదుగా జరిగాయి.

తి. న.చ. తిరువేంగలాచార్యస్వామి - **ఇళంకిలి**
భట్టర్ సుందర ప్రహ్లాదచార్యస్వామి - **వేదకౌముది,**
ఉన్నవ శ్రీనివాస ఆదిత్య శర్మ - **వేదనిధి,**
ఆకెళ్ళ జయకృష్ణశర్మసిద్ధాంతి- **సిద్ధాంతనిపుణ.**


ఉదయం ప్రారంభమైన ఈ సభ పలువురు పండితుల ప్రసంగాలతో సాగింది. మధ్యాహ్నం భోజనానంతరం హైదరాబాదు నాట్య బృందం బాల బాలికలతో నృత్య ప్రదర్శన, తదనంతరం చిన్నజీయర్ స్వామి వారి ఎదుర్కోలు, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో, ఆదివరాహస్వామి ఉపాలయంలో స్వామికి ఆభరణ కిరీటాల సమర్పణం జరిగింది.





పండిత సత్కారములు, సత్కార గ్రహీతల పలుకుల అనంతరం "కాల వివేకః" అను ఒక అరుదైన సంస్కృత గ్రంథాన్ని చిన్న జీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. గొప్ప సంస్కృత పండితుడు జీమూత వాహనుడు రచించిన ఈ గ్రంథం వివిధ సంప్రదాయాల్లో జ్యోతిష్య శాస్త్ర అంశాలను ఏ విధంగా అనుసరించాలో తెలుపుతుంది. 1015వ సంవత్సరంలోని ఈ గ్రంథం తిరిగి 1417 లో పునర్ముద్రితమైనది. తర్వాత రామదాసు కాలంలోనూ, బ్రిటిష్‌వారు రానంత వరకు ప్రమాణంగా ఉపయోగించినట్లు ఆధారం ఉంది. అరుదైన ఈ గ్రంథాన్ని పండితులచే పరిష్కరించి ముద్రించారు. అనంతరం 2025 ఉగాది పంచాంగ ఆవిష్కరణ, బ్రహ్మోత్సవాల కరపత్రావిష్కరణ చేశారు. తదుపరి శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్య, చిన్నజీయర్ స్వామివారల ప్రసంగం తర్వాత మరికొందరు పండితులను సత్కరించారు. అందులో భాగంగానే శ్వాస్ సభ్యులకు ప్రపత్తిశ్రీసన్నిధానం మాసపత్రిక నిర్వాహకులకు, కళాకారులకు శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి వారు వేదికపైన మంగళాశాసనం చేశారు. ★












## బాలవిజ్ఞానం

# ఏది ఉచితం ?

శ్రీమతి విజయ కందాళ



ఒక దట్టమైన అడవిలో ఓ సాధువు తపస్సు చేస్తూ ఉండేవాడు. ఒకరోజు ఆ సాధువు దగ్గర్లో ఉన్న నదిలో స్నానం చేసి ఆశ్రమానికి బయలుదేరాడు. దారిలో రోజు ధ్యానం చేసే చోటుకి కొంచెం పక్కగా నేలమీద ఒక వజ్రపు ఉంగరం ధగధగా మెరిసిపోతూ కనిపించిందాయనకి. ఆయనకి వజ్రపు ఉంగరం అవసరం లేదు. ఎందుకంటే ఆయన సన్యాసి కదా. దేనిమీద కోరిక ఉండదు. అందువల్ల ఆ ఉంగరాన్ని తీసుకోలేదు. తర్వాత కళ్ళు మూసుకుని ధ్యానంలో ఉండిపోయాడు. అయితే కాసేపు అయ్యాక ఆ సన్యాసికి ఎవరో నడుస్తున్న చప్పుడు వినిపించి ఎవరో వచ్చారు, ఆ ఉంగరాన్ని వాళ్ళు పట్టుకుపోతారులే అని కూడా అనుకున్నాడు.

ఆ వ్యక్తి అడుగుల చప్పుడు తన నుంచి కొంచెం దూరం కాగానే, ఆ వ్యక్తి వెళ్లిపోయాడు అనుకుని సాధువు కళ్ళు తెరిచి చూశాడు. ఏముంది అలా వెళ్ళింది ఒక పశువు. అలా ఆ రోజు నుంచి అడుగుల శబ్దం వినగానే సన్యాసి ఎవరో వ్యక్తి వస్తున్నాడు చక్కగా వజ్రపు ఉంగరాన్ని తీసుకొని తనకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసుకుంటాడు అని అనుకునేవాడు. ఆ ఉంగరాన్ని ఎవరూ గమనించలేదు. నాలుగు రోజులు అయిపోయింది ఐదవ రోజు మళ్ళీ సన్యాసి తపస్సులో కూర్చున్నప్పుడు ఎవరో వ్యక్తి వస్తున్న శబ్దం మళ్ళీ వినిపించింది.

ముసలివాడైనట్టి ఓ చాకలివాడు పెద్ద బట్టల మూట మోసుకుంటూ అదే దారిలో రావడం సన్యాసి గమనించాడు. అయితే అతను పాపము ముసలివాడు కదా బరువు కూడా చాలా ఉంది అందువల్ల వంగి వంగి నడుస్తున్నాడు. కనుక ఇతనికి తప్పకుండా ఉంగరం కనిపిస్తుంది. దీన్ని తీసుకొని వెళ్ళిపోతాడు. ఇంక మీదట నేను దీని గురించి ఆలోచించే అవసరం ఉండదు అనుకున్నాడు.


కానీ అతను కూడా ఉంగరం తీసుకోకుండా ముందుకు వెళ్ళిపోయాడు. గమనించిన సాధువు అతను తనను దాటి వెళ్ళగానే పిలిచాడు. అప్పుడు “గమనించావా, నువ్వు వస్తున్న దారిలో ఒక వజ్రపు ఉంగరం మెరుస్తూ ఉంది. దాన్ని తీసుకెళ్లి నీకు కావలసినట్టుగా ఉపయోగించుకో” అని చెప్పాడు. దానికి ఆ చాకలి ఏమన్నాడంటే వచ్చే దారిలో మూడు రోజుల నుంచి ఆ ఉంగరాన్ని చూస్తూనే ఉన్నాను స్వామి!. నేను నా శ్రమతోటే నా కష్టార్జితంతోటే బ్రతకాలి అనుకుంటున్నాను ఉచితంగా వచ్చే ఈ ఉంగరం నాకు అక్కరలేదు. కష్టపడకుండా లభించేది ఏది కూడా నాకు అవసరం లేదు. అందువల్ల నేను ఉంగరం తీసుకోలేదు అన్నాడు

సన్యాసి చాలా ఆశ్చర్యపోయాడు ఎందుకంటే చాకలివాడు చాలా బీదవాడిలాగా కనిపించాడు అలాంటి వాడు కూడా ఈ ఉంగరాన్ని చూసి సొంతం చేసుకోవాలి అనుకోకుండా దాటి వెళ్లిపోవడం అతనికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పుడు సన్యాసి తన మనసులో ఇలా ఆలోచించాడు. గడిచిన ఐదు రోజుల నుంచి ఎంతోమంది ఈ దారిలో వెళ్లారు. ఉంగరాన్ని గమనించనేలేదు. కానీ ఈ చాకలి చూశాడు కానీ తీసుకొని వెళ్లలేదు. అంటే ఇతనికి ఎంత స్వాభిమానం ఉంది. తన కష్టంతో బ్రతకాలి కానీ ఎదుటివారి నుంచి ఏదీ ఆశించకూడదు తనకున్న దాంట్లో తృప్తిగా ఉండాలి ఎంత కొంచెం సంపాదించినా సరే తృప్తి అనేది మనిషికి చాలా ముఖ్యం అని సన్యాసి ఆ చాకలి వాడిని చాలా మెచ్చుకున్నాడు.

ఎవరైనా సరే వారు శ్రమతోటి కష్టపడి సాధించాలి. ఎవరో శ్రమతో సాధించిన దాన్ని మనము వాడుకోవాలి అనుకోవడం చాలా తప్పు. ఉచితంగా వచ్చినటువంటి దాన్ని తొందరపడి స్వాధీనం చేసుకోవాలనుకోకూడదు.

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **FEB 2025** **RNI NO : TELTEL/2024/89280**
Publication Date 1st of Every Month, Posted at Karimnagar, DOP : Every month 5th / 6th

# శ్రీసన్నిధి పదకేళి 12



**అడ్డం**

1.శ్రీరాముని తల్లి (3), 3.తపము చేసిన మహనీయుల్ని ఇలా అంటారు (3), 8.రాజుకు ప్రజలపై ఇది ఉండాలి (2), 9.పువ్వులు (3), 10.కొండల్లో ఇవి ఉంటాయి (2), 13.అజ్ఞాతవాస కాలాన ద్రౌపది పెట్టుకున్న పేరు. (3), 14. శ్రీరాముని బంటు (3), 18. కైక భరతునికి ... (2), 19. పూర్వంలో యజ్ఞం చేసినపుడు ఈ జంతువుని బలి ఇచ్చేవారట (3), 20. శ్రీరాముని భార్య (2), 23. యశస్సు కల్గినవాడు (3), 24 మారీచుని తల్లి (3).

**నిలువు**

2.శ్రీరామునికి సీత (2) 4.'శపథం'లో మార్గం (2), 5.రామాయణంలో అందరూ ఈ కాండను పారాయణ చేస్తుంటారు (3), 6.'వానరులు' లో దాగిన మానవులు (3), 7.గౌతముని భార్య (3), 11.శ్వేత కర్ణుని భార్య (3), 12. రామాయణ కావ్యంలో నున్న రసం (3), 15. ఇంద్రుని సారథి (3), 16. సీతకు తన స్వప్న వృత్తాంతాన్ని చెప్పిన రాక్షస స్త్రీ (3), 17. గోదావరి నదికి గల పేరు (3), 21. మానవులకు ఇది ఉండుట సహజం. 22. అడవులందు రాజులు చేసే వ్యసనపు క్రియ (2)

పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!
సరియైన సమాధానాలు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

**For Ads contact**
**9502583323**

దర్శించండి !! తరించండి !!!
**శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము, బీర్‌పూర్ (గ్రా॥ & మం॥), జిల్లా : జగిత్యాల.**



**జాతర కార్యక్రమములు**
తేది 7-2-2025 శుక్రవారం నుండి 19-2-2025 బుధవారం వరకు
తేది 7-02-2025 శుక్రవారం సా॥ 6-00 గం॥లకు "శ్రీ స్వామి వారి ఊరేగింపు, సేవ"
తేది 8-02-2025 శనివారం సా॥ 4-00 గం॥లకు అంకురార్పణ, ధ్వజారోహణము
తేది 9-02-2025 ఆదివారం సా॥ 6-00 గం॥లకు "శ్రీస్వామి వారి కళ్యాణోత్సవము"
తేది 10-02-2025 సోమవారం సా॥ 6-00 గం॥లకు "అగ్ని ప్రతిష్ఠాపన", "బలిహరణం"
తేది 11-02-2025 మంగళవారం ఉ॥ 10-00 గం॥లకు "వసంతోత్సవము"
తేది 12-02-2025 బుధవారం ఉదయము "చందనోత్సవము, సా॥ 7-00 గం॥లకు "డోలోత్సవము, తెప్పోత్సవము"
తేది 13-02-2025 గురువారం మ॥ 3-00 గం॥లకు "పార్వేట్ ఉత్సవం"
తేది 14-02-2025 శుక్రవారం మ॥ 3-00 గం॥లకు "వనమహోత్సవము"
తేది 16-02-2025 ఆదివారం సా॥ 7-00 గం॥లకు "వేదసదస్సు"
తేది 17-02-2025 సోమవారం ఉదయము 4-00 గం॥లకు (తెల్లవారుజామున) "డోపుకథ",
మ॥ 2-00 గం॥లకు " మహాపూర్ణాహుతి", మ॥ 3-00 గం॥లకు "రథోత్సవము" రా॥ 7-00 గం॥లకు "చక్రతీర్థము"
తేది 18-02-2025 మంగళవారం సా॥ 7-00 గం॥లకు "ఏకాంతోత్సవము"
తేది 19-02-2025 బుధవారం ఉ॥ 10-00 గం॥లకు "ఏకాదశ కలశ స్నపన తిరుమంజనం"
తేది. 10-02-2025 నుండి 17-02-2025 వరకు ఉదయము, సాయంత్రము "నిత్యహోమము, బలిహరణము" నిర్వహించబడును.

**కావున భక్తులందరు పై ఉత్సవములలో శ్రీస్వామివారిని దర్శించుకొని తరించగలరని మనవి.**

గమనిక : జగిత్యాల, ధర్మపురి, ఆదిలాబాద్ జిల్లా నుండి బస్సు సౌకర్యము కలదు. నీటి, వైద్య, విద్యుత్ సౌకర్యములు కలవు.
భక్తుల సౌకర్యార్థము గుట్ట మీద, క్రింద టెంకాయలు, బెల్లము, పట్టెనామాలు, కోరమీసాలు మరియు పూజాసామానులు అమ్మబడును.

గమనిక :- తేది. 26-02-2025 శుక్రవారం మహాశివరాత్రి సందర్భముగా నరసింహస్వామి అనుబంధ ఆలయం అయిన శివాలయంలో "శివపార్వతుల కళ్యాణము" సా॥ శివపార్వతుల ఊరేగింపు సేవ నిర్వహించబడును.

ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు, దాతలు, భక్తులు
అర్చకులు & సిబ్బంది
స్వామి సేవలో.... కార్యనిర్వహణాధికారి

From : **PRAPATTI SRISANNIDHANAM,**
Telugu Monthly,
H No 10-2-225, VIDYANAGAR, KARIMNAGAR - Telangana - 505 001.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI No. TELTEL/2024/89280,
Cell No : 9502583323, Land line No 0878-2253323, Email Id prapatti.srisannidhanam9@gmail.com.